
# ప్రజా తపన

prajathapana.com

*News that matters*

అసహనంతో ఒరిగే ప్రయోజనం ఏమీ లేదు, ఓర్పు వహించండి. విజయం మిమ్మల్ని తప్పక వరిస్తుంది.

స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 5 శుక్రారం 10 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన భూప్రకంపనలు

**న్యూ ఢిల్లీ :**

టర్కీ , సిరియాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస భూకంపాలు యావత్ ప్రపంచాన్నిగ్భ్రాంతికి గురిచేసింది. భూకంపాలు అతి ఎక్కువ వచ్చే ప్రాంతాల్లో టర్కీ , సిరియాలు ఉన్నాయి. గతంలోనూ ఈ దేశాలు భూకంపాల కారణంగా ఎంతో నష్టాన్ని చవిచూశాయి. వరుస భూకంపాలతో ఆయా ప్రాంతాల్లో భారీ భవంతులన్నీ పేకమేడల్లా కుప్పకూలాయి. దీనికితోడు తరుచూ భూప్రకంనలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో భూకంప బాధితులకు అందించే సాయంలో పలు ఆటంకాలు జరిగాయి. మరోవైపు భూకంపం కారణంగా రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయి. విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో శిథిలాల కింద ఇరుక్కుపోయిన బాధితులను ఆస్పత్రులకు తరలించాలన్న ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టర్కీ , సిరియాలో భూకంపాల కారణంగా ఇప్పటికే 15 వేలకు పైగా మృత్యువాత పడటం శోచనీయంగా మారింది. ఒక్క టర్కీ లోనే 12వేల 391 మంది మృతిచెందగా సిరియాలో సుమారు మూడు వేల వరకు మృతి చెందినట్లు తెలుస్తోంది. తాజా సమాచారం మేరకు రెండు దేశాల్లో కలిపి 15వేల 383 మంది మృతిచెందగా వేలాది మంది క్షతగాత్రులు గ మారారు. మరోవైపు శిథిలాల తొలగింపు కొనసాగుతోంది. వీటి కింద లక్షలాది ప్రజలు చిక్కుకున్నారు. వీరిని బయటికి తీసేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయి. ఈక్రమంలోనే మృతుల సంఖ్య సైతం భారీగా పెరిగే అవకాశం కన్పిస్తోంది. రోజులు గడుస్తున్న కొద్ది ఈ సంఖ్య మరింత పెరిగేలా కన్పించడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. తుర్కియేలో సోమవారం నాటి భూకంపాల కారణంగా ఆ దేశంలోని పది ప్రావిన్స్ లు నామరూపాల్లేకుండా పోయాయి. ఒక్కో భవనం కింద సుమారు 400 నుంచి 500 వరకు చిక్కుకుపోయారు. అయితే వీరిని కాపాడేందుకు కనీసం 10 మంది సహాయ సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడం.. శిథిలాలను తొలగించే పరికరాలు.. యంత్రాలు సైతం లేకపోవడంతో టర్కీ అధ్యక్షుడు రెసెస్ తయ్యూప్ ఎర్డోగాన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈక్రమంలోనే భూకంప ప్రభావిత ప్రాంతాలను ఆయన సందర్శించారు. భూకంప బాధితుల కోసం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాలను సందర్శించి మాట్లాడారు. సహాయ చర్యల్లో లోపాలు ఉన్నాయని అంగీకరించారు. అయితే ఈ ఘోర విపత్తును ముందుగా ఊహించినా సిద్ధపడటం సాధ్యం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో మన కళ్లే ముందే కన్పిస్తుందని ఇలాంటి విపత్తుకు



ముందుగా సిద్ధపడటం ఎవరికీ సాధ్యం కాదని తెలిపారు.కాగా తుర్కియే ప్రభుత్వంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలోనే ఆ దేశ రాజధాని అంకారా సహా పలు నగరాల్లో ట్విటర్ పై ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. టర్కీ మొబైల్ నెట్ వర్క్ లో ట్విట్టర్ పని చేయడం లేదని నెట్ బాక్స్ అనే వెబ్ మానిటరింగ్ సంస్థ వెల్లడించింది. అయితే అసత్య ప్రచారాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు భూకంపాల్లో సర్వం కోల్పోయిన బాధితులు రోడ్డున పడ్డారు. గడ్డకట్టే చలిలో వారంతా తాత్కాలిక శిబిరాల్లో తల దాచుకోవడం ప్రతి ఒక్కరిని కలిచివేస్తోంది. గత సోమవారం తెల్లవారుజామున టర్కీ లో 7.8 తీవ్రతతో భారీ భూకంప రావడంతో భారీగా ప్రాణ నష్టం.. ఆస్తి నష్టం వాటిల్లింది

## ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

**అమరావతి**



ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మూడు గ్రాడ్యుయేట్, రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ జారీ అయింది. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలు: ప్రకాశం నెల్లూరు చిత్తూరు, కడప అనంతపురం కర్నూలు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాలు . ప్రకాశం- నెల్లూరు ?చిత్తూరు. కడప- అనంతపురం- కర్నూలు, శ్రీకాకుళం- విజయనగరం- విశాఖపట్నం. ఫిబ్రవరి 16న నోటిఫికేషన్, మార్చి 13న పోలింగ్, మార్చి 16న కౌంటింగ్ జరుగుతాయి.

## నేడు ఎస్ ఎస్ ఎల్ వి -డి 2 రాకెట్ ప్రయోగం

**సుళ్లూరుపేట**

షార్ కేంద్రంనుంచి శుక్రవారం ఎస్ ఎస్ ఎల్ వి ?డి 2 రాకెట్ ప్రయోగానికి అంతా సిద్ధమయిందిరాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లోని శ్రీ చెంగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. పూజల్లో పాల్గొన్న ఇస్రో చైర్మన్ సోమనాథ్, పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. అయనకు ఈవో శ్రీనివాసులు రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.



## పాకిస్తాన్ లో కలిసేది లేదు

**శ్రీనగర్ :**

పాకిస్థాన్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పు పుట్టట్లేదు. ఉన్న అప్పులు తీర్చే మార్గమూ కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లోనూ కశ్మీర్ గురించి పంతం మాత్రం మానడం లేదు. కానీ...క్షేత్రస్థాయిలో చూస్తే...పాక్ సర్కార్‌కు భిన్నంగా కశ్మీర్ ప్రజలు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎంత మంది కశ్మీరీలు పాకిస్థాన్‌లో ఉండాలని కోరుకుంటున్నారనే అంశంపై ఓ సర్వే చేపట్టగా సంచలన విషయాలు వెల్లడయ్యాయి. కశ్మీర్ విషయంలో అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అంటుంటే కశ్మీరీలు మాత్రం "పాకిస్థాన్‌తో మాకు వద్దే వద్దు" అని తేల్చి చెప్పారు. అయితే..ఇది ఇప్పుడు జరిగిన సర్వే కాదు. 13 ఏళ్ల క్రితం 2009లో చేసిన సర్వే. అప్పటికే కశ్మీరీలు పాకిస్థాన్‌తో విసిగిపోయారు. లండన్‌లోని కింగ్స్ కాలేజ్‌కు చెందిన ఓ స్కాలర్ రాబర్ట్ బ్రాడాక్ ఈ సర్వే చేశారు. ఇందులో భాగంగా...3,744 మందిని ఇంటర్వ్యూ చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజల్లో దాదాపు 44% మంది స్వతంత్రత కోరుకున్నారు. అదే భారత్‌లోని కశ్మీర్ ప్రజల్లో 43% మంది స్వాతంత్ర్యం కోరుకున్నారు. పాకిస్థాన్‌లో కలిసేందుకు కశ్మీరీలు ఏ మాత్రం ఆసక్తి చూపలేదని ఈ సర్వేలో స్పష్టమైంది. స్వతంత్రంగా ఉండేందుకే ఎక్కువ మంది మొగ్గు చూపారు. అయితే...కేంద్రం 2019లో కేంద్ర ప్రభుత్వం జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 ని రద్దు చేసింది. పాకిస్థాన్ పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. అప్పుల కుప్పల్లో కూరుకుపోయిన ఆ దేశం ఇప్పట్లో ఆ ఊబి నుంచి బయటపడేలా కనిపించడం లేదు. ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలంటూ ఎఓఈని అర్థిస్తోంది పాకిస్థాన్. కానీ...ఎఓఈ మాత్రం చాలా విషయాల్లో ఆచితూచి వ్యవహరిస్తోంది. 7 బిలియన్ డాలర్ల రుణం అందించేందుకు సిద్ధంగానే ఉన్నా...అందుకు తగ్గ అర్హతలన్నీ పాక్‌కు ఉన్నాయా లేదా అని సమీక్షిస్తోంది. ఈ లోన్





ఇచ్చేందుకు ఇప్పటికే 8 సార్లు పాక్‌కు వచ్చిన ఎఓఈ బృందం...ఇప్పుడు తొమ్మిదో సారీ సమీక్ష జరుపుతోంది. దీనిపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఆర్థిక మంత్రి ఇషాక్ దర్‌కు ఎఓఈని ఎదుర్కోటం చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తమకు గడ్డు కాలం అంటూ వ్యాఖ్యానించారు. రుణ భారం మోయలేక పాక్ ఆర్థిక వ్యవస్థ కుదేలైపోయింది. ఎఓఈరివ్యూ జరిగిన ప్రతిసారీ గండం దాటినట్టే ఉంటోందని పాక్ నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆ దేశ మారక ద్రవ్య నిల్వలు 3.09 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. మరో 18 రోజుల పాటు దిగుమతులకు మాత్రమే ఇవి ఉపయోగపడతాయి. ఆ తరవాత పరిస్థితి ఏంటన్నది ప్రభుత్వానికి అర్థం కావట్లేదు. ఎఓఈ రివ్యూఆధారంగా చూస్తే...పాక్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. పెట్రోల్ రేట్లను 16% పెంచాలి. ఎల్‌పీజీ సిలిండర్ల ధరల్ని 30% పెంచాలి. వీటిని అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోంది. కానీ..ఎఓఈ మాత్రం ఈ కండీషన్స్ ఓకే అంటేనే లోన్ ఇస్తామని తేల్చి చెబుతోంది.

# అంతరిస్తున్న ప్రాచీన "శూలేశ్వరాలయ" ప్రాశస్త్యం



డా॥ బడిగె ఉమేశ్ (అసోసియేట్ ఫెలో)
చరవాణి : 9494815854
ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.





దేవాలయం ముందు ఉన్న ధ్వజస్తంభం

భారతీయ చరిత్రకు, సనాతన సంస్కృతికి ఆనవాళ్లు ఆలయాలు. శిల్పం, చిత్రలేఖనం, సంగీతం, సాహిత్యం, నాట్యం వంటి శాస్త్రీయత, కళా సమ్మిళితమైన దేవాలయాలను సర్వజన సంక్షేమం కోసం, లోక కళ్యాణార్థం నిర్మిస్తారు. అపురూప కట్టడాలు, ఆశ్చర్యపరిచే శిల్పకళా రూపాలు, తన్మయత్వంతో ముంచెత్తే చిత్తరువులు మన పూర్వీకులు మనకు అందించిన అమూల్య సంపదలు. వేదభూమిగా వినుతికెక్కిన భారతదేశంలో ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే దేవాలయాలు, చారిత్రక ప్రదేశాలు, దుర్గాలు, పుణ్యక్షేత్రాలు శతాబ్దాల నాగరికథను కథలు కథలుగా కళ్లకుకట్టి, ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. అప్పటి రాజులు దైవభక్తికి ప్రతీకగా ఆలయాలు నిర్మించి అర్చనలు జరిపారు. నాటి చారిత్రకతకు స్మృతి చిహ్నాలుగా ఆ కట్టడాలు ఇంకా మిగిలే ఉన్నాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకుని ఆదరణను కోల్పోయే స్థితికి చేరుకున్నాయి కూడా. నిజానికి ప్రాచీన ఆలయాలు మన సాంస్కృతిక నిలయాలని చెప్పాలి. అలాంటి వాటిలో ములకలేడు"శూలేశ్వరాలయం"ఒకటి. దాని ప్రాశస్త్యాన్ని, సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకుందాం.

ములకలేడు అనే గ్రామం అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం శెట్టూరు మండలానికి 12 కిలో మీటర్ల దూరంలో ఉంది. జిల్లాలోఉన్న పెద్ద చెరువులలో ములకలేడు చెరువుది నాలుగవ స్థానం. ఈ గ్రామానికి ఆ పేరు రావడానికి చిన్నకథ ప్రచారంలో ఉంది. "పూర్వం వైష్ణవులు శైవుల మధ్య వైరం తీవ్ర స్థాయిలో ఉండేది. ఆ సమయంలో ఇక్కడ శైవం బాగా ప్రాచుర్యాన్ని పొందింది. గ్రామంలో శివుడు ప్రత్యక్షంగా వెలిశాడని ఇక్కడి ప్రజలు చెబుతారు. దాని ఆధారంగా ఈ ఊరికి త్రిముఖంగా శూలేశ్వర, సంగమేశ్వర, మూలేశ్వర అనే మూడు శివాలయాలు వెలిశాయి. ఆ శివుడే తమ గ్రామానికి రక్షణ అని అక్కడి ప్రజల నమ్మకం. అందుకే మూడు ఈశ్వరాలయాలకు చిహ్నంగా ఈ గ్రామానికి 'ములకలేడు' అనే పేరు వచ్చిందని స్థానికులు చెప్తారు. ఆ మూడు ఈశ్వర దేవాలయాలలో 'శూలేశ్వర' దేవాలయం గురించి ప్రత్యేకంగా పేర్కొనాలి. దీనిని అక్కడి ప్రజలు 'శూలప్పగుడి' అని పిలుస్తారు. శూలేశ్వరుడు కాస్త శూలప్పగా ప్రాచుర్యం పొందాడు. సాధారణంగా రాలయసీమలో 'అప్ప' అనే దానిని పేర్లకు చివరన వాడుతారు. అప్ప అంటే తండ్రి అని అర్థం ఉంది. మామూలుగా పురుష దేవుళ్ళకు అప్ప అని, స్త్రీ దేవతలకు 'అమ్మ' అని సంభోదిస్తారు. ఇందులో అపారమైన పూజ్యభావన ఉంటుంది.

నేడు శిథిలావస్థలోని శూలేశ్వర స్వామి ఆలయం 13వ శతాబ్దానికి చెందిన చోళ రాజుల పాలనలో ఈ ఆలయ నిర్మాణం జరిగిందని చరిత్ర చెబుతుంది. ఈ కట్టడం ఎంతో మనోహరంగా ఉంటుంది. రాతి బండలతో దీన్ని నిర్మించారు. ఏవో మంత్ర శక్తులతో భద్రత కల్పించినట్లనిపింస్తోంది. ఆలయ గోపురం ఒక పిరమిడ్ ఆకారంలో కనబడుతుంది. ఇక్కడ శివలింగం, గుడికి ఎదురుగా ఉన్న గోపురం ఇలా అన్నీ ఆశ్చర్యం కలిగించే విధంగా ఉంటాయి. ప్రస్తుతం ఈ దేవాలయం పాత బడిపోయిందని ఎవరూ అక్కడికి పెద్దగా వెళ్ళడం లేదు. ఇది చెరువులో ఉంటుంది. పెద్ద వర్షాలు వచ్చి, చెరువు నిండినప్పుడు ఈ గుడి కనబడకుండా మునిగిపోతుంది. ఇది ఒకానొకప్పుడు నిత్య పూజలు అందుకున్న దేవాలయంగా వినుతికెక్కింది. ఈ ఆలయ స్థలం అపార సంపదలకు నిలయమని కొందరి భావన. కానీ వాటికోసం ఇక్కడ ఎటువంటి తవ్వకాలు జరగలేదు. గుడి ముందున్న ధ్వంసమైన శివలింగం చోళ రాజు ప్రతిష్టించినట్లు చెప్తారు.

కానీ ఎటువంటి ఆనవాళ్ళు లభ్యం కాలేదు. దీనికి చెందిన ఆధారాలు ఎవరి దగ్గర ఉన్నాయన్నది కూడా స్పష్టంగా తెలియదు. స్థానిక చరిత్ర (క్రైఫియత్)లో దీని సమాచారం వెతికాను. కానీ దొరకలేదు. "అనంతపురం మండల సర్వస్వం" లో కూడా ఈ దేవాలయ ప్రస్తావన కనబడలేదు. అయితే ఈ గ్రామంలో కొందరు చదువుకున్న విద్యావంతుల్ని (వి. తిప్పేస్వామి ఉపాధ్యాయులు, యం. మల్లికార్జున పరిశోధకులు) వాకబుచేస్తే! "ఈ ఆలయానికి సంబంధించిన వివరాలు మౌఖికంగా మాత్రమే ఉన్నాయి కానీ లిఖిత పూర్వకంగా లేవని" చెప్పారు. దేవాలయం లోపల రాతి గోడల మీద ప్రాచీన లిపిలో శాసనాలు కనబడతాయి. వాటిని చదివితే చరిత్రకు సంబంధించిన కొత్త విషయాలు తప్పకుండా అవగతమవుతాయి. అపారమైన సంపదలు దేవాలయగర్భంలో ఉన్నాయన్న నమ్మకంతో కొందరు దొంగలు తవ్వే ప్రయత్నం చేశారు. దీని వల్ల క్రమంగా ఆ దేవాలయానికి ఉన్న వైభవం మొత్తం పాడైపోయింది. ప్రస్తుతం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడ పూజా పునస్కారాలు జరగడం కూడా తగ్గిపోయింది. ఆలయం లోపలికి కూడా ఎవరు వెళ్ళే ప్రయత్నం చేయడం లేదు. ప్రస్తుతం గబ్బిలాలకు నిలయంగా భాసిల్లుతోంది.

ఈ గుడి దగ్గర కనబడుతున్న శిల్పాలు ఎంతో చూడముచ్చటను గొల్పుతున్నాయి. చక్కనైన నగిషీలతో అబ్బుర పరుస్తాయి. గొప్ప శిల్పకళా సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి.



శూలప్ప దేవాలయం దగ్గర ఉన్న దేవతామూర్తుల శిల్పాలు

ఈ శూలేశ్వర దేవాలయం సరైన పూజలు అందుకున్నన్ని రోజులూ ఆ చుట్టు పక్కల గ్రామాలు కూడా సస్యశ్యామలంగా, సిరి సంపదలతో తులతూగడం పరిపాటి. నిత్య పూజలు జరిగినన్ని రోజులూ ఆగ్రామ చెరువు ప్రతీ ఏడాది నీటితో నిండింది. అది చిన్న చెరువు కాదు 1000 ఎకరాల విస్తీర్ణం కలిగిన పెద్ద చెరువు. దాని ఆయకట్టు కూడా చాలా విస్తృతమైనది. ములకలేడు చెరువు నిండితే చాలు చుట్టుపక్కల పదుల గ్రామాలకు నీళు ళ్ళ సంవృద్ధిగా ఉన్నట్లే. అంత గొప్ప పేరున్న చెరువది.

ఇప్పుడు ఒక పెద్దాయన (బ్రాహ్మణ పండితుడు సుబ్బరామప్ప) ఆ దేవాలయాన్ని పునరుద్ధరించాలని సంకల్పిస్తున్నారనే వార్త తెలుసుకున్న అక్కడి స్థానిక ప్రజలు తమ సంతోషాన్ని ఈ విధంగా వ్యక్తంచేశారు. "మా గ్రామ శూలేశ్వరుడు పూర్వం నుండి నేటి వరకు మమ్మల్ని ఎంతగానో రక్షిస్తున్నాడు. అయితే కొన్నేళ్ళుగా గుడిని గురించి పట్టించుకునే వారు కనబడలేదు. ఇక ఆ దేవాలయ సంగతి కాల గర్భంలో కలిసి పోతుందిలే అనుకున్నాము. కానీ దీని పునర్నిర్మాణానికి నడుం కట్టాలనే ఆలోచన రావడంతో మాలో కొత్త ఆశలకు బీజం పడింది. మా గ్రామ పూర్వ వైభవానికి ఈ పరిణామాన్ని నాందీ గీతంగా భావిస్తున్నాం. అంతే కాదు శూలప్పగుడిలో నిత్యం నందా దీపం (ఎప్పటికి ఆరిపోని దీపం) వెలగాలని మేము కోరుకుంటున్నాము" (ఈ దేవాలయ వివరాలను, ఫోటోలను ఆ గ్రామానికి చెందిన యువకుడు, నిత్య చైతన్య శీలి అయిన ఎం. సాయినాథ్ బాబు సౌజన్యంతో సేకరించాను.)

అయితే పెద్దాయన సంకల్పం సిద్ధించి పరమేశ్వరుడి ఆశీస్సులతో గుడి పూజలందుకుని విరాజిల్లితే, మళ్ళీ ఆ ఊరి చెరువు నిండి పచ్చని పంట పొలాలతో అన్నదాతలకు ఆదెరువవుతుందని అక్కడి ప్రజలందరి కోరిక. రాయలసీమ వ్యాప్తంగా ఇలాంటి ప్రాచీన దేవాలయాలు ఎన్నో శిథిలావస్తకు చేరుకుంటున్నాయి. ఈ ఆలయాలు మన సాంస్కృతిక వైభవానికి చిహ్నాలని ప్రభుత్వాలు భావించాలి. దేవాదాయ శాఖవారు ఇటువంటి ఆలయాలను గుర్తించి వాటి పురోభివృద్ధికి చేయూతనిస్తే మరింత మేలు జరుగుతుందని ప్రజల విశ్వాసం.

గమనిక : నెల్లూరులోని "ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం" ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో గల ప్రాచీన చారిత్రక ప్రదేశాలు, దేవాలయాల సమాచారాన్ని జిల్లాల వారిగా సేకరించి, జాబితాగా రూపొందించి, వాటి



# నేనే తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని

**విజయవాడ :**

గుడివాడలో టీడీపీ అభ్యర్థిని తానేనని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రకటించుకున్నారు. ఒక్క అవకాశం ఇస్తే ప్రతి కుటుంబానికి న్యాయం చేస్తానని ప్రజలకు పిలుపునిస్తున్నారు. గుడివాడ పట్టణం 32వ వార్డులో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని రావి వెంకటేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని, యువతను మోసం చేస్తూ వస్తున్నారన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ద్వారా ప్రజలందరినీ చైతన్యవంతం చేస్తున్నామన్నారు. గత 20 ఏళ్ళలో ఎమ్మెల్యే కొడాలి నాని గుడివాడ నియోజకవర్గానికి చేసిందేమీ లేదంటున్నారు.గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడు కాల్వగట్టుపై నివాసముంటున్న పేద కుటుంబాలకు ప్రత్యామ్నాయం చూపాలని అడిగినందుకు తనపై కేసులు పెట్టారన్నారు. జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారని, కోర్టులో హాజరుపర్చగా ధర్మమే గెలిచిందన్నారు. అక్రమంగా ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. కుట్రలు, కుతంత్రాలను ఎదుర్కొనే



దమ్ముందని చెప్పుకొచ్చారు. టీడీపీ శ్రేణులు కూడా రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నాయన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని వైసీపీ ప్రభుత్వం ఉల్లంఘిస్తోందన్నారు. ప్రజల స్వేచ్ఛను హరించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. పేదలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు దొంగ మాటలు చెప్పి లక్షల కోట్లు అప్పు చేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. గుడివాడలోని ప్రజలంతా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని రావి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. తాను ఇసుక అమ్ముకోనని, మట్టిని దోపిడీ చేయనని చెప్పారు. క్యాసినో వంటి అసాంఘిక వ్యవహారాల జోలికి వెళ్ళనని మాటిస్తున్నానన్నారు. కొడాలి నాని విషయంలో ప్రజలే సరైన నిర్ణయం తీసుకోవాలన్నారు. గుడివాడ నుండి తరిమి తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. గత 20ఏళ్ళుగా ఎమ్మెల్యే కొడాలి నాని నియోజకవర్గ ప్రజలను తన స్వార్ధానికి వినియోగించుకున్నారన్నారు. అధికారం వచ్చిన తర్వాత రూ.వేల కోట్లు దోచుకున్నాడన్నారని ఆరోపించారు. ప్రజలతో పని లేదన్న పద్దతిలోనే కొడాలి నాని ముందుకు వెళుతున్నారన్నారు. కొడాలి నాని చేసిన దుర్మార్గాలు, భూకబ్జాలను అరికడతానని అన్నారు.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో అర్హులందరికీ పథకాలను అందజేశామన్నారు. ప్రజల కోసం పని చేసే పార్టీలను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రావి విజ్ఞప్తి చేశారు.

ఇటీవల గుడివాడలో పేదల ఇళ్ళ తొలగింపు వ్యవహారం తీవ్ర స్ధాయిలో దుమారాన్ని రాజేసింది.దీంతో పోలీసులు రావి వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి జిల్లాలోని పలు చోట్లకు తిప్పారు.అర్ధరాత్రి సమయంలో స్టేషన్ కు తీసుకువచ్చి,అరెస్ట్ చేసినట్లుగా ప్రకటించి,తెల్లవారు జామున న్యాయమూర్తి ఎదుట ప్రవేశ పెట్టారు.దీంతో న్యాయమూర్తి విచారణ చేసి రావికి బెయిల్ మంజూరు చేశారు.ఆ తరువాత రోజు నుండే రావి వెంకటేశ్వరరావు నియోజకవర్గంలో ఇదేం ఖర్మ కార్యక్రమం పేరుతో నియోజకవర్గంలో పర్యటించటంతో స్దానిక టీడీపీ నేతలు ఉత్సాహంగా ఆయన్ను ఫాలో అయ్యారు.

# కోటంరెడ్డితో వచ్చేది ఎవరు..

**నెల్లూరు :**

నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్తగా ఎంపికైన తర్వాత ఆదాల ప్రభాకర్ రెడ్డి స్పీడ్ పెంచారు. తొలిసారిగా కార్పొరేటర్లతో మీటింగ్ పెట్టిన ఆయన స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 26మంది అధికార పార్టీ కార్పొరేటర్లు ఉండగా వారిలో కేవలం 18మంది మాత్రమే ఆయన వద్దకు వచ్చారు. మిగతా వారంతా కోటంరెడ్డి టీమ్ లో ఉన్నారు.వచ్చిన కార్పొరేటర్లతో ప్రత్యేకంగా సమావేశమైన ఆదాల.. గతంలో లాగా కాకుండా కార్పొరేటర్లకు పూర్తి స్వేచ్ఛ ఇస్తామన్నారు. వారికి సమస్యలుంటే నేరుగా తనకి కాల్ చేయాలని చెప్పారు. అధికారులతో చెప్పి పనులు చేపిస్తామన్నారు, కార్పొరేషన్ లో రెండు మూడు రోజుల్లో సమావేశం పెడతామని చెప్పారు. వారం రోజుల్లో డివిజన్లలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన నిధులు తెస్తానన్నారు. తనతో కలసి రాని వారి స్థానాల్లో డివిజన్ ఇన్ చార్జ్ లను నియమిస్తామని హెచ్చరించారు.నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి పార్టీని విడిపోయినా, కార్యకర్తలు స్థానిక నాయకులు, కార్పొరేటర్లు, రూరల్ పరిధిలోని సర్పంచ్ లు, జడ్పీటీసీలు.. వీరంతా పార్టీతోనే ఉంటారని అధిష్టానం అంచనా వేసింది. అయితే మొదటి రెండురోజుల్లో నాయకులంతా కోటంరెడ్డి ఆఫీస్ లో కనిపించారు. ఆ తర్వాతే మెల్లమెల్లగా వారిలో చలనం మొదలైంది.విజయ భాస్కర్ రెడ్డి అనే కార్పొరేటర్, తన కార్యాలయంలో కోటంరెడ్డి బ్యానర్లు, ఫ్లెక్సీలు తీసేయించిన తర్వాత అసలు కథ మొదలైంది. ఆయన ఇంటికెళ్లి కోటంరెడ్డి విచారించడం, ఆ తర్వాత కోటంరెడ్డిపై సదరు కార్పొరేటర్ కిడ్నాప్ కేసు పెట్టడంతో ఈ వ్యవహారం అనేక మలుపులు తిరిగింది. కోటంరెడ్డి కూడా ప్రెస్ మీట్ పెట్టి తానెవర్నీ బెదిరించలేదన్నారు. అవసరమైతే తనపై హత్యాయత్నం కేసు కూడా పెట్టుకోవచ్చని చెప్పారు. అయితే విజయ భాస్కర్ రెడ్డి మాత్రం తాను వైసీపీలోనే ఉంటానని, కోటంరెడ్డి కోటరీలో చేరేది లేదన్నారు. ఆ తర్వాత బొబ్బల శ్రీనివాస్ యాదవ్ వంటి కరడుగట్టిన కోటంరెడ్డి అభిమాని కూడా ఆదాల గూటికే చేరుకున్నారు. ఆయనతోపాటు కోటంరెడ్డి సపోర్ట్ తోనే ఎదిగిన మహిళ కార్పొరేటర్లు కూడా ఆదాలకు జై అన్నారు. ఇలా ఒక్కొక్కరే ఆదాల క్యాంప్ కి వచ్చేశారు. ప్రస్తుతం రూరల్ పరిధిలో 26 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో 18మంది ఆదాల దగ్గరకు వచ్చి చేరారు.ఎవరు ఎటు ఉన్నా నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతి.. తాను కోటంరెడ్డి వెంటే ఉంటానని చెప్పారు. తమకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ఆయన్ని వదిలిపెట్టి వెళ్లేది లేదన్నారు. దీంతో కొంత గందరగోళ వాతావరణం ఏర్పడింది. అయితే మేయర్ కి కూడా పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు బాలినేని. మేయర్ సహా మిగతా కార్పొరేటర్లంతా సీఎం జగన్ నిర్ణయం మేరకు ఆదాల క్యాంప్ లోకి రావాల్సిందేనన్నారు. తాజాగా ఆదాల కూడా ఇదే విషయం స్పష్టం చేశారు. తనతోపాటు కార్పొరేటర్లు కలసి రాకపోతే.. వారి వార్డుల్లో ఇన్ చార్జ్ లను ప్రకటిస్తామని కాస్త గట్టిగానే హెచ్చరించారు. తనతోపాటు కలసి వచ్చే కార్పొరేటర్లందకీ త్వరలో సీఎం జగన్ తో పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేయిస్తామన్నారు. అందరినీ పార్టీ గుర్తు పెట్టుకుంటుందని భరోసా ఇచ్చారు.

# అప్పులపై రాజకీయ రభస

**గుంటూరు :**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న అప్పుల అంశం ప్రతీ సారి హైలెట్ అవుతూనే ఉంది. తాజాగా ప్రభుత్వం సమయానికి జీతాలివ్వలేకపోతూండటంతో మరోసారి హైలెట్ అయింది. ఈ క్రమంలో అప్పుల్లో ఫస్ట్ ..అభివృద్ధిలో లాస్ట్ అంటూ ఏపీ ఆర్థిక పరిస్థితిపై మరోసారి అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. రాష్ట్రం అప్పుల్లో మునిగిపోవడానికి కారణం మీరంటే మీరని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. ఈ విమర్శలు, ఆరోపణల్లో నిజమెంత ?ఏపీ సిఎం జగన్ని నిన్నటివరకు సిబిఐ దత్తపుత్రుడిగా అభివర్ణించిన జనసేన అధినేత ఇప్పుడు అప్పురత్నగా బిరుదు ఇచ్చారు. ఏపీ అప్పుల్లో కూరుకుపోయిందని వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విపక్షాలు గగ్గోలు పెడుతూనే ఉన్నాయి. శ్రీలంక తరహాలోనే రేపో మాపో ఏపీ కూడా దివాళా తీయడం ఖాయమని కూడా జోస్యం చెప్పాయి. అయితే ఈ ఆరోపణలు, విమర్శలను అధికారపార్టీ ఖండించింది. అంతేకాదు ఈ అప్పులకు కారణం కూడా చంద్రబాబేనని ఆరోపించింది. కొత్తరాష్ట్రానికి సిఎంగా వచ్చిన చంద్రబాబు ఆ నాడు కోట్లు ఖర్చు పెట్టి అన్నీ తాత్కాలిక భవనాలే కట్టిందని తెలిపింది. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉన్నప్పటికీ ఓటుకు నోటు కేసుతో ఏపీకి పరుగులు పెట్టి అమరావతి వేదికగా రియల్ వ్యాపారం చేసిందని , అన్నీ తాత్కాలికంగా కట్టి ప్రజాధానాన్ని కోట్లలో వృదా చేసిందని ఆరోపిస్తోంది. ఇలా అప్పుల విషయంలో ప్రతీసారి అధికార-విపక్షాల మధ్య ఈ తరహా ఆరోపణలు రావడం మాములు కావడంతో ప్రజలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. అయితే 2019 తో పోలిస్తే ఇప్పుడు అప్పులు ముఖ్యంగా ఈ 9 నెలల కాలంలో ఏపీ చేసిన అప్పులే 55 కోట్లకు పైగా ఉందని తేలడంతో ఇప్పుడీ విషయాన్ని హైలెట్ చేస్తూ జనసేన కార్టూన్ రూపంలో సెటైరికల్ గా విమర్శించింది. అటు లోకేష్ కూడా అప్పులపై కామెంట్ చేయడంతో అధికారపార్టీ అలర్ట్ అయ్యింది. ఈ అప్పులన్నీ మీ నాన్న చంద్రబాబు టైమ్ లోవే జరిగిందని మంత్రి రోజా కౌంటర్ ఇచ్చారు. డిస్కంలతో సహా పలు అభివృద్ధి పనులకు ఆనాడు చంద్రబాబు వేల కోట్ల రూపాయలు చెల్లించకపెండింగ్ లో పెట్టారని అవన్నీ జగన్ హయాంలో తీర్చారని చెబుతూ లెక్కలతో సహా మరోసారి సిద్ధమయ్యారు. అంతేకాదు చర్చలకు సిద్ధమా అని విపక్షాలకు సవాల్ విసురుతున్నారు. అంతేకాదు విపక్షాల ఆరోపణలకు త్వరలో జరగనున్న అసెంబ్లీ వేదికగా ప్రజలకు వివరించాలని కూడా అధికారపార్టీ ఆలోచన చేస్తోంది.2019లో 2.24లక్షల కోట్లు ఉంటే ఇప్పుడు అది రూ.4.42 లక్షల కోట్లకు ఏపీ అప్పు చేరింది. ఇది కాకుండా బడ్జెటేతర అప్పు కూడా పెరిగిపోతుండటంతో విపక్షాలు ఈ అంశంపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. రానున్న ఎన్నికల్లో అప్పుల అంశం కూడా కీలకంగా మారనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.కొత్త రాష్ట్రం అభివృద్ధికి కేంద్రం ఎంత నిధులు ఇస్తోంది..రాష్ట్రం ఎందుకు ఇన్ని లక్షల కోట్లు అప్పులు చేస్తుందన్న విషయంపై కాకుండా అధికార-విపక్షాల మధ్య చర్చ మీరంటే మీరు కారణమని తిట్టుకోవడానికే సరిపోతుండటంపై ప్రజల్లోనూ అసహనం వ్యక్తమవుతోంది.

# కడప జిల్లా టీడీపీ పదవికి పోటీ

**కడప :**

కడప పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడిగా ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే ఎం. లింగారెడ్డి ఉన్నారు. వచ్చే మార్చి నాటికి ఆయన జిల్లా అధ్యక్ష పదవి చేపట్టి రెండేళ్లు పూర్తవుతుంది. 2024లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో పార్టీ జిల్లా పగ్గాలు మరొకరికి ఇవ్వాలనే ఆలోచనలో టీడీపీ అధిష్ఠానం ఉందట. అయితే ఎవరిని ఆ హాట్ సీటులో కూర్చోబెట్టాలో ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారట. నియోజకవర్గాల వారీగా ఇంఛార్జుల నుంచి అభిప్రాయ సేకరణ చేసిన సమయంలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినట్టు సమాచారం. కడప జిల్లా టీడీపీ చీఫ్ అయ్యేందుకు పలువురు నాయకులు బలంగా లాబీయింగ్ చేస్తున్నారట. ప్రస్తుతం అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్న ఆర్. శ్రీనివాసులరెడ్డి కడప జిల్లా పార్టీ పగ్గాలు చేపట్టేందుకు ఆసక్తితో ఉన్నారట. వచ్చే ఎన్నికల్లో ఆయనే కడప ఎంపీగా పోటీ చేస్తారని అనుకుంటున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో శ్రీనివాసుల రెడ్డే చక్రం తిప్పారు. 2019 ఎన్నికల తర్వాత పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా జిల్లా అధ్యక్షులు వచ్చారు. ఆ విధంగా కడప జిల్లా టీడీపీ అధ్యక్ష బాధ్యతలు లింగారెడ్డి చేతికి వచ్చాయి. అయితే పార్టీకి లింగారెడ్డి ఏమీ చేయలేదని స్వపక్షంలోని ఆయన వైరివర్గం విమర్శ. ఆర్. శ్రీనివాసులరెడ్డి ఆసక్తితో ఉన్నా.. ఆయన పేరును ఎందుకు ఖరారు చేయడం లేదన్నది తెలుగు తమ్ముళ్ల ప్రశ్న.పార్టీ పదవి కోసం ఎమ్మెల్సీ బీటెక్ రవి కూడా పోటీ పడుతున్నారట. ప్రస్తుతం పులివెందుల అసెంబ్లీ టీడీపీ ఇంఛార్జ్‌గా ఉన్నారు బీటెక్ రవి. గతంలోనూ జిల్లా టీడీపీ అధ్యక్ష పదవి రేస్‌లో రవి పేరు వినిపించింది. ఏ కారణాలవల్లో అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు బీటెక్ రవి పేరు మరోసారి చర్చల్లో నలుగుతోంది. ఇటీవల పులివెందుల ఇంఛార్జ్ హోదాలో టీడీపీ పెద్దలతో రవి భేటీ అయ్యారు. ఆ సమావేశంలోనే తనకు జిల్లా పార్టీ పగ్గాలు ఇవ్వాలని ఆయన కోరినట్టు ప్రచారం జరుగుతోంది. పులివెందుల టికెట్ ఎవరికి ఇచ్చినా తనకు అభ్యంతరం లేదని.. జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే చాలని రవి చెప్పారట. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోను తనకు అనుకూలంగా వర్గాలను తయారు చేసుకుని బీటెక్ రవి అడుగులు వేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ఆర్. శ్రీనివాసులరెడ్డికి దూరంగా ఉన్న టీడీపీ నేతలు, కేడర్ రవితో టచ్‌లోకి వెళ్తోందట. ఈ క్రమంలో పోటాపోటీగా పార్టీ పెద్దలకు ఫిర్యాదులు వెళుతున్నాయట. ప్రస్తుతం ఈ విషయంలో వాసు, రవి ప్రయత్నాలు టీడీపీ రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి.

# 12 ఏళ్ల తర్వాత బైపాస్ కు మోక్షం

**విజయవాడ :**

విజయవాడ మీద ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించేందుకు ఎన్టీఆర్ జిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు 49.3 కి.మీ. పొడవున ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. దాదాపు రూ.4,607 కోట్ల రుపాయల అంచనాతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. కృష్ణాజిల్లా పొట్టిపాడు నుంచి గుంటూరు జిల్లా కాజ వరకు మొత్తం 49.3 కి.మీ. మేర నిర్మించేలా కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు రూపొందించింది.కృష్ణానదిపై వారధి దిగువున 3.750 కి.మీ. వంతెన కూడా నిర్మిస్తారు. మొత్తం ఈ ప్రాజెక్టుకు రూ.4,607.80 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. విజయవాడకు పశ్చిమం వైపు చిన్నఅవుటపల్లి నుంచి గొల్లపూడి మీదుగా కాజ వరకు బైపాస్ నిర్మాణం జరుగుతుండగా, తూర్పువైపు కూడా బైపాస్ కావాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రభుత్వ ప్రతిపాదనకు సమ్మతి తెలిపిన భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ఎలైన్‌మెంటు ఖరారు, డీపీఆర్ సిద్ధం చేయిస్తోంది.ఈస్ట్ బైపాస్ నిర్మాణానికి మొదట 40కి.మీ. మేర పొడవున నిర్మించాలని భావించారు. ఇందులో నాలుగు మార్గాలను పరిశీలించి తీసుకున్నారు. ఇందులో 49.3 కి.మీ. ఎలైన్‌మెంటుకు ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం తెలిపే వీలుందని అధికారులు చెబుతున్నారు. దాదాపుగా ఖరారైన ఎలైన్‌మెంటు కృష్ణాజిల్లా పరిధిలో 29.5 కి.మీ., గుంటూరు జిల్లా పరిధిలో 19.770 కి.మీ. మేర ఉంటుంది. 100 కి.మీ. వేగంతో వాహనాలు ప్రయాణించేందుకు వీలుగా నాలుగు వరుసలుగా ఈస్ట్ బైపాస్ నిర్మాణం చేపడుతున్నారు. భవిష్యత్తులో ఆరు వరుసల



విస్తరణకు వీలుగా 60 మీటర్ల వెడల్పుతో ఎలైన్‌మెంటు ఖరారు చేస్తున్నారు.మొత్తం 295 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంటుందని అంచనా వేశారు. జాతీయ రహదారి నిర్మాణ వ్యయం 2,215.48 కోట్లు, 295 ఎకరాల భూసేకరణతో పాటు, వాటిలో ఉన్న నిర్మాణాలకు పరిహారంగా రూ.1,176.08 కోట్లు, విద్యుత్ స్తంభాలు, కాల్వలను పక్కకు మార్చేందుకు రూ.39.41 కోట్లు, జీఎస్టీ రూ.1,176.82 కోట్లు కలిపి మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.4,607.80 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు రూపొందించారు. తూర్పు బైపాస్ నిర్మాణంలో కృష్ణానదిపై వంతెనతో పాటు , 22 ప్రధాన వంతెనలు, 2 ఆర్వోబీలు, ఒక ఫ్లైఓవర్, 2 ఇంటర్‌ఛేంజ్‌లు నిర్మించేలా ప్రాథమిక డిజైన్ ఖరారు చేశారు.కృష్ణా తూర్పు బైపాస్ కృష్ణాజిల్లా ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, తోట్లవల్లూరు, పెనమలూరు, ఉయ్యూరు మండలాల్లోని.. ఆత్కూరు, పెదఅవుటపల్లి, అల్లాపురం, బుతిమిల్లిపాడు, తెన్నేరు, తరిగొప్పుల, మారేడుమాక, కోమటిగుంట, మానికొండ, కోలవెన్ను, దావులూరు, నేపల్లె, చలివేంద్రపాలెం, బొడ్డపాడు, రొయ్యూరు మీదుగా వెళ్లనుంది. అక్కడినుంచి కృష్ణా నదిపై వంతెన దాటాక గుంటూరు జిల్లాలోని కొల్లిపర్ల, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల్లోని.. వల్లభాపురం, పెరకలపూడి, చుక్కపల్లివారిపాలెం, మోరంపూడి, చిలువూరు, తుమ్మపూడి, చినకాకాని, కాజ గ్రామాల మీదగా ఎన్‌హెచ్-16లో కలుస్తుంది.తరిగొప్పుల, మోరంపూడిల వద్ద రైల్వేలైన్లు, దావులూరు వద్ద మచిలీపట్నం -విజయవాడ జాతీయరహదారి మీదగా తూర్పుబైపాస్ వెళ్లేలా ఎలైన్‌మెంటు రూపొందించారు. డిపిఆర్‌కు తుది ఆమోదం లభించాల్సి ఉందని, చివర్లో స్వల్ప మార్పులు ఉండే వీలుందని అధికారులు చెబుతున్నారు. బైపాస్ నిర్మాణానికి భూసేకరణ వ్యయాన్ని రాష్ట్రప్రభుత్వం భరించాలని తొలుత కేంద్రం కోరింది.ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రంలో నిధులు వెచ్చించే పరిస్థితి లేదని రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. దీంతో ప్రాజెక్టు నిర్మాణంలో వినియోగించే వివిధ ఖనిజాలకు తీసుకునే సీనరేజి ఫీజు, నిర్మాణ సామగ్రికి రాష్ట్ర జీఎస్టీని మినహాయించాలని కేంద్రం సూచించింది. విజయవాడకు సమీపంలో నిర్మించనున్న మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్‌కు 100 ఎకరాలు ఉచితంగా కేటాయించాలని కేంద్రం కోరింది. దీంతో మంగళగిరిలో 100 ఎకరాలను రాష్ట్రప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ మేరకు నిధులను సర్దుబాటు చేయనున్నారు.

# మానవత్వంతో స్పందించిన ఖాకీలు

**విజయనగరం**

ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్ సొరడ గ్రామానికి చెందిన ఈడే గురు (30 సం.లు) అనే మహిళ అనారోగ్య కారణాలతో విశాఖపట్నం జిల్లా సంగివలస వద్ద గల అనిల్ నీరుకొండ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం భర్త సాములు జాయిన్ చేశారు. చికిత్స అందించిన వైద్యులు చికిత్సకు స్పందించడం లేదని తిరిగి సొంత ఊరు తీసుకొని వెళ్ళిపోవాలని తెలిపారు.

చేసేది ఏమీ లేక భార్యను తీసుకొని, ఆటోలో విజయనగరం వస్తుండగా మార్గ మధ్యంలో భార్య ఈడే గురు మరణించారు. అర్ధంతరంగా ఆటో డ్రైవరు చెల్లూరు రింగు రోడ్డులో వారిని దించేసి, వెళ్ళిపోయారు. దిక్కుతోచని స్థితిలో భర్త తన భార్య శవాన్ని ఎలా ఒడిస్సాకు చేర్చాలో తెలియక భార్య శవాన్ని భుజం మీద వేసుకొని, కాలి నడకన బయలుదేరగా, స్థానికులకు ఏమీ జరిగిందో తెలియక, అతను ఒడియాలో చెప్పిన విషయం అర్ధంకాక స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విషయం



తెలుసుకున్న రూరల్ సిఐ టివి తిరుపతిరావు, గంట్యాడ ఎస్ఐ కిరణ్ కుమార్ తో కలిసి, చెల్లూరు రింగు రోడ్డలో వెళ్లి పరిశీలించగా, సదరు వ్యక్తి భార్య శవంను భుజాన వేసుకొని, వెళ్ళుతుండడం గమనించి, అతని ద్వారా విషయం తెలుసుకొని, ఒడిస్సాలో అతని బంధువులతో ఫోనులో మాట్లాడారు. వారి విజ్ఞప్తి మేరకు రూరల్ సిఐ టివి తిరుపతిరావు ఒడిస్సా రాష్ట్రం సుంకి వరకు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. వారిని అంబులెన్స్ లో ఒడిశా రాష్ట్రం సుంకికి ఉచితంగా రవాణా సౌకర్యం కల్పించి, మానవత్వం చూపారు. పోలీసులు అందించిన సహాయానికి శాములు కృతజ్ఞతలు తెలిపాడు.

# తెలంగాణాలో ముందస్తు ఖాయం

**హైదరాబాద్ :**

తెలంగాణలో ముందస్తు ఎన్నికల సందడి కనిపిస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శరవేగంగా తీసుకుంటున్న నిర్ణయాలు .. వేగంగా అమలు చేస్తున్న పథకాలు అన్నీ ముందస్తు ఎన్నికల సంకేతాలేనని భావిస్తున్నారు. అయితే ఎన్నికల ఏడాది కాబట్టి కేసీఆర్ ఇలా పాలన పరుగులు పెట్టిస్తున్నారని సాధారణ సమయంలోనే ఎన్నికలు జరుగుతాయని కొంత మంది విశ్లేషిస్తున్నారు. ఒక వేళ ముందస్తు ఎన్నికలు అంటూ వస్తే..బీఆర్ఎస్ ను ఓడిస్తామంటున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రెడీగా ఉన్నాయా ? వెంటనే అభ్యర్థులను ఖరారు చేసుకోగలవా ? తెలంగాణలో ముందస్తు ఎన్నికలకు వెళ్లాలా వద్దా అన్నది కేసీఆర్ నిర్ణయం. అంతా ఆయన చేతుల్లోనే ఉంది. ఎప్పుడు అసెంబ్లీని రద్దు చేస్తే ఆ తర్వాత రెండు, మూడు నెలల్లో ఎన్నికలు జరగడానికి అవకాశం ఉంటుంది. ఒక వేళ రద్దు చేయకపోయినా నవంబర్ డిసెంబర్‌లో జరుగుతాయి. అయితే కేసీఆర్ జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టడానికి మరోసారి ముందే ఎన్నికలకు వెళ్లాలని అనుకుంటున్నారని చాలా కాలంగా ప్రచారం జరుగుతూ వస్తోంది. ఒక వేళ అదే నిజమైతే కేసీఆర్ అన్ని రకాలుగా సిద్ధమయి ఉంటారు. 2018లో ముందస్తు ఎన్నికలకు వెళ్లడానికి ముందు కేసీఆర్ అభ్యర్థులపై కూడా పూర్తి కసరత్తు చేశారు. అన్ని రకాల సన్నాహాలు పూర్తి చేసుకుని రంగంలోకి దిగారు. ఎక్కడా వెనుతిరిగి చూడకుండా ..మరోసారి విజయాన్ని అందుకున్నారు. ఈ సారి కూడా ముందస్తుకు వెళ్లాలనుకుంటే.. అంతే ప్రణాళిక ప్రకారం వెళ్తారు. అందులో ఎలాంటి సందేహాలు ఉండవు. అంటే.. కేసీఆర్ ప్రిపరేషన్స్ విషయంలో బీఆర్ఎస్ కు ఎలాంటి టెన్షన్స్ ఉండవు. ఎన్నికల వార్ లో గ్రౌండ్ రెడీ చేసుకుని కేసీఆర్ యుద్ధానికి సిద్ధమైపోయి ఉంటారు కానీ.. విపక్షాలు మాత్రం సిద్ధంగా ఉంటాయా లేదా అన్నది ఆలోచించాల్సిన విషయమే. బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఉన్న రెండు పార్టీలు జాతీయ పార్టీలే. వాటి నాయకత్వం ఢిల్లీలో ఉంటుంది. ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్నా ఢిల్లీ నుంచే తీసుకోవాలి. అందుకే బీఆర్ఎస్ అధినేతగా కేసీఆర్ తీసుకున్నంత వేగంగా నిర్ణయాలు తీసుకోలేరు. ఇంకా చెప్పాలంటే.. ముందస్తుగా కసరత్తు కూడా చేసుకోలేరు. అందుకే రెండు విపక్ష పార్టీల్లోనూ అలాంటి పరిస్థితి కనిపిస్తోంది. ఇంకా ఎన్నికల ప్రిపరేషన్స్ ప్రారంభించలేని నిస్సహాయత కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి ముందస్తు ఎన్నికలు వచ్చినా... సమయానికే ఎన్నికలు జరిగినా సిద్ధమవడం అనే కసరత్తే ఉండదు. ఎన్నికల తేదీలు వచ్చాక.. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత కూడా అబ్యర్థుల కసరత్తు జరుగుతూనే ఉంటుంది. ఇంకా చెప్పాలంటే.. నామినేషన్ల ఉపసంహారణ గడువు వరకూ ఈ పంచాయతీ జరుగుతుంది. ఇలాంటి రాజకీయ కసరత్తు ఉండే కాంగ్రెస్ పార్టీలో ముందస్తు ఎన్నికలు వచ్చినా రాకపోయినా పెద్దగా మార్పేమీ ఉండవు. అయితే ఈ సారి కాంగ్రెస్ పార్టీ తరపున రేవంత్ రెడ్డి నాయకత్వం వహిస్తున్నారు. ముందస్తు ఎన్నికలకు సిద్ధమని ఆయన చెబుతున్నారు.. కానీ సీనియర్ల సహాయ నిరాకరణతో ఎప్పటికప్పుడు వెనక్కి తగ్గుతూనే ఉన్నారు. ఆయన రెండు, మూడు రోజుల కిందటే పాదయాత్ర ప్రారంభించారు. ఇప్పటికిప్పుడు ముందస్తు ఎన్నికలు వస్తే రేవంత్ కిందా మీదా పడాల్సిందే. ఇక అధికారంలోకి వచ్చేస్తున్నామని ప్రకటనలు చేస్తున్న బీజేపీ నేతలకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అనుకూలంగా లేవు. ముఖ్య నేతలు ఉన్న నియోజకవర్గాల్లో తప్ప ఆ పార్టీకి అభ్యర్థులు లేరు. చేరికల కోసం వేసిన మాస్టర్ ప్లాన్స్ అన్నీ విఫలమయ్యాయి. ఇప్పటికిప్పుడు ముందస్తు ఎన్నికలు వస్తే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో టిక్కెట్లు రాని నేతలకు .. బీ ఫారాలు ఇచ్చి పోటీ చేయించడం మినహా ఆ పార్టీకి మరో దారి ఉండదన్న వాదన ఉంది. మొత్తంగా అన్ని రాజకీయ పార్టీలు ... ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధమేనని ప్రకటనలు చేస్తూ ఉంటాయి. కానీ అసలు గ్రౌండ్‌లో మాత్రం అలా ఉండదు. ఇప్పటికిప్పుడు తెలంగాణలో ముందస్తు ఎన్నికలు వస్తే.. సన్నాహాల్లో మాత్రం బీఆర్ఎస్ పార్టీదే పైచేయి అని చెప్పక తప్పదు.

# ఈ కార్ రేసుకు అంతా సిద్ధం

**హైదరాబాద్ :**

మోటార్ రేస్‌తో పోల్చితే ఎలక్ట్రానిక్ కార్ల రేస్ డిఫరెంట్. 2014 నుంచి జరుగుతున్న ఈ రేసుల్లో ఉపయోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ కారణంగా ఈ-కార్ రేస్ కొత్తపుంతలు తొక్కుతోంది. హుస్సేన్ సాగర్ ఒడ్డున.. ఎన్టీఆర్ గార్డెన్ చుట్టూ ఫార్ములా ఈ వరల్డ్ ఛాంపియన్ షిప్ రేస్‌కి ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. హైదరాబాద్ స్ట్రీట్ సర్క్యూట్ పేరుతో సిద్ధం చేసిన 2.8 కిలోమీటర్ల ట్రాక్‌పై శనివారం సాయంత్రం ఫార్ములా రేస్ జరగబోతుంది. 11 టీమ్ లు.. 22 కార్లు.. ప్రాక్టీస్, క్వాలిఫైయింగ్‌తో కలిపి 4 రేస్‌లు జరుగుతాయి. శుక్రవారం సాయంత్రం 4.25 నుంచి 5.15 గంటల వరకు ఫ్రీ ప్రాక్టీస్ -1తో రేసింగ్ కార్లు ట్రాక్ పై దూసుకుపోనున్నాయి. శనివారం ఉదయం 8.05 నుంచి 8.55 వరకు ఫ్రీ ప్రాక్టీస్ -2 జరుగుతుంది. ఆ తర్వాత 10.40 నుంచి 11.55 వరకు గంటకు పైగా క్వాలిఫైయింగ్ రేస్ జరగనుంది. మధ్యాహ్నం 3.05 నుంచి 4.30 వరకు వరల్డ్ ఛాంపియన్ షిప్ ఫార్ములా ఈ రేస్ జరగబోతుంది. గంటా 25 నిమిషాల పాటు నాన్ స్టాప్‌గా 22 కార్లు హుస్సేన్ సాగర్ తీరాన మెరుపు వేగంతో దూసుకెళ్తాయి. ఎలక్ట్రిక్ బ్యాటరీతో నడిచే ఈ కార్లు గరిష్టంగా గంటకు 340 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటాయి. 3 సెకన్లలో 62 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తాయి. కార్ల స్పీడ్‌కి తగ్గట్టు ఈఎం నిబంధనల ప్రకారం ట్రాక్ సిద్ధమైంది. కార్గోఫ్లైట్‌లో ఎలక్ట్రిక్ కార్ల విడిభాగాలు ఇప్పటికే చేరుకున్నాయి. స్టార్టింగ్ గ్యారేజ్‌లో వాటిని సెట్ చేస్తారు. స్పోర్ట్స్ కార్లు రెడీ అవుతున్న వేళ.. పోటీలను వీక్షించేందుకు జనం ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. ఈవెంట్‌కి నగరవాసులు ఎక్కువ సంఖ్యలో వస్తారని అంచనా వేస్తున్న నిర్వాహకులు భారీ సీటింగ్ ఏర్పాటు చేశారు. దాదాపు 22,500 టికెట్లను బుక్‌మైషో, ఎస్‌నెట్‌జెన్‌లో ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టారు. ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్ ఈ ప్రిక్స్ పేరుతో గ్రీన్‌కో నిర్వహిస్తుండగా.. హెచ్ఎండీఏ ట్రాక్‌ను సిద్ధం చేసింది. అందరి భాగస్వామ్యంతో ఇంటర్నేషనల్ ఈవెంట్‌ను గ్రాండ్‌గా సక్సెస్ చేస్తామంటున్నారు నిర్వాహకులు

# ప్రతిపక్షాల యాత్రలకు దీటుగా జగన్ యాత్ర

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలు జరగడానికి ఇంకా 14 నెలలకుపైగా సమయం ఉన్నప్పటికీ రాజకీయ పార్టీలన్నీ రంగంలోకి దిగిపోయాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు... ప్రభుత్వ పాలన దారుణంగా ఉందని "ఏపీకి ఇదేం ఖర్మ" పేరుతో జిల్లాల్లో పర్యటిస్తున్నారు. నారా లోకేష్ పాదయాత్ర చేస్తున్నారు. మరో వైపు జనసేనాని పవన్ కల్యాణ్ త్వరలో వారాహి యాత్ర ప్రారంభించబోతున్నారు. అందరూ ప్రజల్లోకి వెళ్తూంటే.. మరి వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ ఎలాంటి ప్రచార వ్యూహం అవలంభించబోతున్నారన్నది ఆసక్తిగా మారింది. ఇప్పుడు జగన్ కూడా ఫైనల్ చేసుకున్నారని.. ఏప్రిల్ నుంచి రంగంలోకి దిగుతారని అంటున్నారు. ఇంతకూ జగన్ ఏం చేయబోతున్నారంటే ?అసెంబ్లి బడ్జెట్ సమావేశాల తరువాత సీఎం జగన్ బస్సు యాత్ర నిర్వహించాలని అనుకుంటున్నారు. బస్సు యాత్రలోనే పల్లె నిద్ర కార్యక్రమాన్ని చేపట్టాలని యోచిస్తున్నారు. ఆదిశగా ఇప్పటికే ప్రణాళికలు రూపొందిస్తు న్నారు. అసెంబ్లి సమావేశాల తరువాత రూట్‌మ్యాప్ కూడా ఖరారు చేయనున్నారు. వీటికంటే ముందుగా మరో వినూత్న కార్యక్రమానికి జగన్ శ్రీకారం చుట్టబోతున్నారు. ఈనెల 11 నుండి సంక్షేమ ఫలాలు అందుతున్న ప్రతి ఇంటికీ 'మా నమ్మకం నువ్వే జగనన్న' అనే నినాదంతో స్టిక్కర్లను అంటించనున్నారు. పై మూడు కార్యక్రమాలను నిర్వహించి ప్రజలతో మరింత మమేకం కావాలని సీఎం జగన్ యోచిస్తూ ఆదిశగా అడుగులు వేయబోతున్నారని వైఎస్ఆర్‌సీపీ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికలకు సమయం దగ్గరపడేకొద్దీ రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు వివిధ కార్యక్రమాల పేరుతో నిరంతరం ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. అందులో భాగంగానే టీడీపీ యువగళం పేరుతో లోకేష్ పాదయాత్రను ప్రారంభించారు. మరోవైపు జనసేన అధినేత కూడా త్వరలో వారాహి యాత్ర చేపట్టాలని యోచిస్తున్నారు. ఇప్పటికే నవరత్నాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదలకు అవసరమైన సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం జగన్ ఇప్పటివరకూ ప్రజలకు అందిన పథకాల గురించి వివరించేందుకు పల్లె నిద్ర బస్సు యాత్ర కార్యక్రమాన్ని చేపట్టబోతున్నారు. బస్సు యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో పర్యటిస్తూ ప్రతి రోజూ ఏదో ఒక గ్రామంలో పల్లె నిద్ర చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో పల్లె నిద్ర చేసే సందర్భంలో రచ్చబండ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని యోచిస్తున్నారు. గతంలోనే రచ్చబండ నిర్వహించాలని సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. అయితే, కోవిడ్ తదితర కారణాలవల్ల రచ్చబండ కార్యక్రమం కొంత జాప్యం జరిగింది. చివరి ఆరేడు నెలలు ప్రజల్లో ఉండేలా జగన్ కార్యక్రమాలు ఖరారవుతాయి. 2019 ఎన్నికల్లో రికార్డు స్థాయిలో విజయం సొంతంచేసుకున్న జగన్ వచ్చే ఎన్నికల్లో కూడా మరో సంచలన విజయాన్ని సొంతం చేసుకోవాలని వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే ప్రతి ఎమ్మెల్యేను గడప గడపకు వెళ్లమని ఇప్పటికే ఆదేశాలిచ్చారు. గత ఏడాది మే 11 నుండి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతోంది. ప్రతి రెండు నెలలకు ఒకసారి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై సీఎం జగన్ వర్క్ షాపును నిర్వహించి ఎమ్మెల్యేల పనితీరును వివరిస్తూ వస్తున్నారు. ఈనేపథ్యంలోనే ఈ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేస్తూ నిరంతరం ఎమ్మెల్యేలను ప్రజల్లో ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తంగా ఏపీలో ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలూ సమాయత్తమయ్యాయి. రంగంలోకి దిగిపో?యి. చివరి ఆరేడు నెలలు నేతలంతా రోడ్లపైనే కనిపించనున్నారు.

# సీబీఐ ఆదేశాలు... సీఎస్ బేఖతార్

**హైదరాబాద్ :**

ఫామ్ హౌస్ కేసులో సీబీఐ విచారణ ప్రారంభించడానికి ఎలాంటి ఆటంకాలు లేవు.కానీ సీబీఐ మాత్రం ఇంకా విచారణ ప్రారంభించలేదు. దీనికి కారణం ఏమిటన్నది తాజాగా బయటపడింది. ఫామ్ హౌస్ కేసు వివరాలివ్వడానికి తెలంగాణ ప్రభుత్వం ఏ మాత్రం సిద్ధంగా లేదు. ఇప్పటికే సీబీఐ హైకోర్టు తీర్పును అనుసరించి ఐదు సార్లు తెలంగాణ చీఫ్ సెక్రటరీకి లేఖలు పంపింది. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు వివరాలు ఇవ్వాలని లేఖల్లో సీబీఐ పేర్కొంది. అయితే తెలంగాణ సీఎస్ మాత్రం ఈ విషయంలో స్పందించలేదు. ఈ వ్యవహారం ఇప్పుడు సంచలనంగా మారే అవకాశం కనిపిస్తోంది. సీబీఐకి తెలంగాణ ప్రభుత్వం జనరల్ కన్సెంట్ రద్దు చేసింది. అయితే కోర్టు ఆదేశించే కేసుల్ని విచారణ చేయడానికి ఆటంకాలు ఉండవు. అయితే కేసుల వివరాలు ప్రభుత్వం హ్యాండోవర్ చేయాల్సి ఉంటుంది. కానీ తెలంగాణ ప్రభుత్వం ఫామ్ హౌస్ కేసులో సీబీఐ విచారణను పూర్తి స్థాయిలో వ్యతిరేకిస్తోంది. ఫామ్ హౌమ్ కేసు సీబీఐ చేతికి వెళ్లకుండా .. తెలంగాణ సర్కార్ చేస్తున్న ప్రయత్నాలేమీ ఫలించడం లేదు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై మళ్లి సింగిల్ బెంచ్‌లో పిటిషన్ వేసింది ప్రభుత్వం. సీజే అనుమతి కావాలని సింగిల్ చెప్పడంతో మళ్లీ సీజే వద్దకు వెళ్లారు. అంతుక ముందే ఎందుకైనా మంచిదని సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ వేయడంతో హైకోర్టు సీజే బెంచ్.. సుప్రీంకోర్టులోనే తేల్చుకోవాలని స్పష్టం చేసిది. అదే సుప్రీంకోర్టులో అత్యవసరంగా విచారించాలని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది విజ్ఞప్తి చేస్తే.. అంత తొందరేం లేదని సీజేఐ స్పష్టం చేశారు. పదిహేడో తేదీన విచారిస్తామని తెలిపారు. అదే సమయంలో స్టేటస్ కో ఇవ్వడానికి కూడా నిరాకరించారు. విచారణలో కేసు లో మెరిట్స్ ఉంటే హై కోర్ట్ తీర్పును రివర్స్ చేస్తామని సీజేఐ తెలంగాణ న్యాయవాదికి తెలిపారు. సిబిఐ చేతికి సాక్ష్యాలు వెళ్తే చేసేది ఏమీ లేదని వాదించినా సీజేఐ పెద్దగా పట్టించుకోలేదు. దీంతో విచారణకు పదిహేడో తేదీ వరకూ ఆగాల్సి ఉంది. ఇదే సమయంలో విచారణ ప్రారంభించడానికి సీబీఐకి ఎలాంటి అడ్డంకులు లేవు. సీబీఐ ఇప్పటికి మూడు సార్లు కేసు ఫైల్స్ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీకి లేఖ రాసింది. కానీ ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. మరోసారి సీబీఐ లేఖ రాసింది. ఈ కేసు విషయం సుప్రీంకోర్టుకు చేరింది. సుప్రీంకోర్టులోనూ సీబీఐ విచారణ ఆపడానికి ఎలాంటి ఆదేశాలు రాలేదు. పదిహేడో తేదీ వరకూ సీబీఐ రాసిన లేఖలపై స్పందించకుండా ఉండే అవకాశం లేదు. అది కోర్టు ధిక్కరణ అవుతుంది. కేసు ఫైల్స్ సీబీఐ చేతికి వెళ్లకూడదని తెలంగాణ ప్రభుత్వం పట్టుదలగా ఉంది. ఇప్పటికీ కేసు ఫైల్స్ అప్పగించకపోతే.. కోర్టు ధిక్కరణ అవుతుంది. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ఏం చేస్తుందనేది చర్చనీయాంశంగా మారింది.

# అప్పర్ భద్ర నిర్మాణం ఆపాలి

**కడప**

అప్పర్ భద్రనిర్మాణం తక్షణమే ఆపాలని, రాయలసీమకు నీళ్లు కేటాయింపులు చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది.. ఆర్ సి పి రాష్ట్ర కార్యాలయంలో రవిశంకర్ రెడ్డి అధ్యక్షతన అప్పర్ భద్ర నిర్మాణ నేపథ్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి రవి శంకర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నజీర్ అహ్మద్, ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు కృష్ణ, జనతాదల్ యస్ రాష్ట్ర అధ్యక్షులు వైయం ప్రతాపరెడ్డి, ప్రముఖ న్యాయవాది అలీ ఖాన్, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కర్ణాటకలో ఎట్లైనా గెలవాలని, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా అప్పర్ భద్ర మీద కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టుని ఆగమేఘాలమీద జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిందని ధ్వజమెత్తారు. 17 డైరెక్టర్ రేట్లు అనుమతి ఇవ్వాల్సిన ప్రాజెక్టుకు 17 నెలల్లో అనుమతి రావడం ఆశ్చర్యం కలిగించింది అన్నారు. 17,000 కోట్ల ప్రాజెక్టుకు 22,000 కోట్లకు రీ డిజైన్ చేస్తే కూడా ఒక్క మాట కూడా అడక్కుండా ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం ఇతర ప్రాజెక్టు అలా ఎందుకు వ్యవహరించలేదని ప్రశ్నించారు. రాయలసీమలోని ప్రాజెక్టులన్ని వట్టి, భూములన్ని




బీడులు అవుతాయని, రాయలసీమ ప్రాంతం ఎడారి ప్రాంతంగా మారిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్న రాయలసీమలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు కనీసం మాట్లాడకపోవడం సీమ ప్రజల పట్ల వాళ్లకు ఉన్న చులకన భావానికి నిదర్శనమని విమర్శించారు. ముఖ్యమంత్రి బెల్లం కొట్టిన గుండ్రాయి లాగా గమ్మగా ఉండడం ఏమిటని ప్రశ్నించారు. తమ సొంత కేసులు, రాజకీయ ప్రయోజనాల కోసం తమ రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన రాయలసీమ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. కనీస ప్రతిఘటన కూడా చేయలేని బానిసలు లాగా వైసిపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని దయ్యబట్టారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వమే అఖిలపక్షం నిర్వహించి తీవ్ర నిరసనని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అఖిలపక్ష ఉద్యమాన్ని వైసీపీ నాయకత్వాన ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కేంద్రం ప్రభుత్వ వైఖరికి నిరసనగా సుప్రీంకోర్టు కైనా వెళ్లి అప్పర్ భద్రను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జగన్మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన రాయలసీమలో శాశ్వతపు రాజకీయ సమాధి నిర్మించుకున్న వాడు అవుతాడని విరుచుకుపడ్డారు. ఇప్పటికైనా మేల్కొని రాయలసీమ ప్రయోజనాలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో అన్ని పక్షాల్ని కలుపుకొని విస్తృతస్థాయి ప్రజా ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మక్బూల్ బాషా, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మీదేవి తస్లీమ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మున్రెడ్డి రాయలసీమ ట్రేడ్ యూనియన్ జిల్లా కార్యదర్శి సిద్దిరామయ్య నాయకులు అజయ్ గంగన్న కాసిం చాపల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సంకష్టహర చతుర్థి పూజలందుకున్న మహాగణపతి




**మంథని**

సంకష్టహర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టత సంతరించుకుంది. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత సంకటహర చతుర్థి వస్తుంది. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు. ప్రతి మంగళవారం భక్తులు విగ్నేశ్వరుని పూజిస్తుంటారు. ముఖ్యంగా సంకటహర చతుర్థి రోజున మంథని పట్టణ ప్రజలే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుండి సైతం అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. సంకటహర చతుర్థి దీక్ష పట్టిన భక్తులు రాత్రి చంద్రోదయం అనంతరం మాత్రమే ఉపవాస దీక్షను విరమిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పల్లి రాము ఆలయానికి వచ్చిన భక్తులకు సంకల్పాలు, అర్చనలు, అభిషేకాలు చేయించారు. ఆలయంలోని స్వామి వారిని అలంకరిస్తూ భక్తుల సౌకర్యార్థం అర్చకులు పల్లి సంజీవ్, పల్లి రాము సోదరులు అన్ని ఏర్పాట్లు చేశారు.

## తల్లి తల నరికిన కొడుకు

**జనగామ**



జనగామ మండలంలోని మరిగడి గ్రామంలో దారుణం జరిగింది. కన్నతల్లిని కొడుకు కిరాతకంగా హత్య చేసాడు. కూరాకుల కన్నప్ప అనే వ్యక్తి తన కన్నతల్లి రమణమ్మ తల కోసి అతికిరాతకంగా హత్య చేసాడు. రమణమ్మ తలను మొండెం నుంచిచ వేరు చేసాడు.

పూర్తి వివరాలు ఇలా వున్నాయి. రమనమ్మకు ఒక కొడుకు ఒక కూతురు. భర్త అంతకుముందే చనిపోయాడు. రమణమ్మ బిడ్డ రెండు సంత్సరాలక్రితం ఒక వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఇప్పుడు వచ్చి నాకు అస్తి లో వాట కావాలని అడిగింది.

వాళ్ళ నాన్న సంధించిన భూమి ఎనినీమిది ఎకరాలలో నాలుగు ఎకరాలు రమణమ్మ కూతురు పేరు మీద చేసింది. అది మనసులో పెట్టుకున్న కొడుకు కన్నప్ప గురువారం ఉదయం తల్లి తల నరికేశాడు.

## అయిల్ ఫ్యాక్టరీలో ప్రమాదం..ఏడుగురు కార్మికుల మృతి

**కాకినాడ**

పెద్దాపురం మండలం జి రాగంపేట లో ఘోర ప్రమాదం జరిగింది. అంబటి సుబ్బయ్య ఫ్యాక్టరీలో ఆయిల్ ట్యాంకర్ శుభ్రం చేసేందుకు కార్మికులు ట్యాంకర్లోకి దిగారు. ప్రమాదవశాత్తు ట్యాంకర్లో ఊపిరాడకపోవడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందాడు.. మృతుల్లో ఐదుగురు పాడేరు వాసులుగా, మరో ఇద్దరు పెద్దాపురం మండలం పులిమేరువాసులుగా గుర్తించారు. అయిల్ ఫ్యాక్టరీ ఇంకా నిర్మాణంలో ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. దర్యాప్తు ప్రారంభించారు. మృతులు పాడేరుకు చెందిన మొచ్చంగి కృష్ణా, మొచ్చంగి నరసింగా, మొచ్చంగి సాగర్, కురతాడు బంజు బాబు, కుర్ర రామారావు, పులిమేరు గ్రామానికి చెందిన కట్టమురి జగదీష్, ప్రసాద్‌గా గుర్తించారు

## రాగంపేట దుర్ఘటనపై హోంమంత్రిగ్భ్రాంతి

**అమరావతి**

పెద్దాపురం లోని రాగంపేటలో జరిగిన దుర్ఘటనపై హోంమంత్రి తానేటి వనితగ్భ్రాంతి వ్యక్తం చేసారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయిల్ ట్యాంకర్ లో ఊపిరాడక కార్మికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రఘాడ సానుభూతిని తెలిపారు.

## అత్యాధునిక వైద్య సౌకర్యాలతో దంతవైద్యం



**కడప**

కడప నగర ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో దంతవైద్య సేవలు అందిస్తామని సూర్య డెంటల్ కేర్ వైద్యులు డా. ఎం. సరిత, డా. అలివేణి (ఎండీ)లు తెలిపారు. స్థానిక పాలెంపాపయ్యవీధిలో డాక్టర్ సూర్య డెంటల్ కేర్ వైద్యశాలను మాజీ ఎండీ, వైఎస్ఆర్ మహిళా విభాగం అధ్యక్షులు బుట్టా రేణుక ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యాధునిక వసతులతో అత్యాధునిక పరికరాలతో డాక్టర్ సరిత, డా. అలివేలు కడప జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం సేవలు అందిస్తారని తెలిపారు.

## ప్రమాదానికి గురైన కారు-కారులో గంజాయి

**విశాఖపట్నం**

విశాఖ అరకు ఘాట్ రోడ్డులో గురువారం ఉదయం ప్రమాదానికి గురైన కారులో ఆరు బస్తాల గంజాయి బయటపడింది..వివరాలు ఇలా ఉన్నాయి..అరకు ఏజెన్సీ ప్రాంతం నుండి గుర్తుతెలియని గంజాయి స్మగ్లర్లు ఆరు బస్తాల గంజాయిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు తరలిస్తూ..అరకు ఘాట్ రోడ్డు అనంతగిరి మండలంలోని ఎయిర్ పిన్ బ్యాండ్-8 మలుపు వద్ద ఏపీ 24 ఏఎక్స్ 6789 నెంబరు గల ఓ కారు రోడ్డు ప్రమాదానికి గురైంది.ప్రమాదానికి గురైన ఆ కారులో ఆరు బస్తాలతో గంజాయి బయటపడింది.దీనితో స్మగ్లర్లు కారును వదిలి వెళ్ళిపోయారు.సమాచారం అందుకున్న అరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఇంచార్జీల పాలనలో హైదరాబాద్ కలెక్టరేట్

**హైదరాబాద్ :**

తెలంగాణలోని మెజార్టీ జిల్లాలకు ఈ మధ్యే కొత్త కలెక్టర్లను నియమించారు. కానీ హైదరాబాద్‌కు పూర్తిస్థాయి కలెక్టర్ రాలేదు. ఇప్పుడూ కలెక్టర్‌గా ఇంఛార్జ్‌నే వేశారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్‌గా ఉన్న అమయ్ కుమార్‌కు హైదరాబాద్ కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మొన్నటిదాకా అమయ్ కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్. తాజా బదిలీల్లోనైనా హైదరాబాద్‌కు పూర్తిస్థాయి కలెక్టర్‌ను నియమిస్తారని అనుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు మరో తొమ్మిది నెలలే ఉండటంతో రెండేళ్ల కంటే ఎక్కువగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీలు చేశారు. అయినప్పటికీ రాజధాని హైదరాబాద్‌కు మాత్రం కొత్త కలెక్టర్ రాలేదు. అంతకుముందూ హైదరాబాద్ పరిస్థితి ఇంతే. రంగారెడ్డి కలెక్టర్‌గా ఉన్న అమయ్ కుమారే హైదరాబాద్‌కు ఇంఛార్జ్ కలెక్టర్‌గా కొనసాగారు. కొన్నాళ్లు శర్మన్ హైదరాబాద్ కలెక్టర్‌గా చేసి ఇక్కడే పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత ఇంఛార్జ్ పాలనలోకి వెళ్లింది. శర్మన్ కంటే ముందు పనిచేసిన ఎయాలు పూర్తి స్థాయిలో ఇక్కడ విధుల్లో లేరు. శ్వేతా మహంతి కలెక్టర్‌గా వచ్చిన కొన్నాళ్లకే విదేశీ చదువు కోసం లాంగ్ లీవ్‌లో వెళ్లిపోయారు. ఆ తర్వాత చాన్నాళ్లు ఇంఛార్జే దిక్కయ్యారు. శ్వేతా మహంతి కంటే ముందు హైదరాబాద్ కలెక్టర్‌గా రాహుల్ బొజ్జా ఉన్నారు. ఆయన పరిస్థితి అంతే. రాహుల్ బొజ్జా కూడా లాంగ్ లీవ్ పెట్టి విదేశాలకు వెళ్లిపోయారు. మొత్తానికి ఈ జిల్లాకు స్థిరంగా ఒకటి రెండేళ్లపాటు ఒక కలెక్టర్ అంటూ లేకుండా పోయారు. ఉఊఓఅ పరిధిలోనే హైదరాబాద్ ఉంది. ఉఊఓఅ కమిషనర్‌గా కూడా ఎయా అధికారే ఉంటారు. అందుకే హైదరాబాద్ కలెక్టర్ సీటుపై చిన్నచూపనే వాదన అధికారుల్లో ఉందట. కానీ సమస్యలతో మాత్రం జనం కలెక్టరేట్‌కు నిత్యం వస్తుంటారు. రెండు కలెక్టరేట్లకు ఒకే ఎయా న్యాయం చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఐదుగురు సీనియర్ అధికారులకు ఐఎఎస్‌గా ప్రమోషన్ రానుందని సమాచారం. వారిలో ఎవరికో ఒకరికి హైదరాబాద్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చే ఛాన్స్ ఉందని తెలుస్తోంది

# 12 జిల్లాల్లో ఎల్లో అలెర్ట్

**హైదరాబాద్ :**

తెలంగాణలో కొన్ని జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ విభాగం ఎల్లో అలర్ట్ అలర్ట్ జారీ చేసింది. ఇక గత కొద్ది రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో పొడి వాతావరణం ఉంటుండగా, అదే కొనసాగుతుందని రెండు రాష్ట్రాల వాతావరణ కేంద్రాల అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌తో పోల్చుకుంటే తెలంగాణలో చలి తీవ్రత కాస్త ఎక్కువగా ఉండబోతుంది. నేడు మూడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. కొద్ది రోజులుగా తెలంగాణలో చలి సాధారణంగా ఉండగా, ఇప్పుడు కాస్త పెరిగింది. రాష్ట్రంలో ఉత్తర తెలంగాణలోని 12 జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ విభాగం ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తెలంగాణలోని 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మూడు రోజుల క్రితం (ఫిబ్రవరి 5) ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయిన సంగతి తెలిసిందే. సాధారణంగా 5 నుంచి 10 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందనిపిస్తే వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తుంది. 11 నుంచి 15 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉంటే ఎల్లో అలెర్ట్ జారీ చేస్తుంటారు. రాబోయే ఐదు రోజులకు సంబంధించి తెలంగాణ వాతావరణ విభాగం నమోదు కానున్న ఉష్ణోగ్రతల అంచనాలను వెదర్ బులెటిన్‌లో వివరించింది. ఆదిలాబాద్, కుమ్రుం భీమ్, మంచిర్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, పెద్దపల్లి, కరీంనగర్, ములుగు, జగిత్యాల, కామారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. రేపు, ఎల్లుండి నుంచి క్రమంగా చలి తగ్గిపోతుందని వెదర్ బులెటిన్ లో వివరించారు. తెలంగాణ ప్రాంతంలో ఎలాంటి వర్ష సూచన లేదు. ఇక ఆదిలాబాద్ లో గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు అయింది. 34.3 డిగ్రీలు నమోదైనట్టు వాతావరణ విభాగం తెలిపింది. అత్యల్ప ఉష్ణోగ్రత కూడా అక్కడే 13.2 డిగ్రీలు ఆదిలాబాద్‌లో నమోదైంది. ఇవాళ అత్యధిక ఉష్ణోగ్రత 30 డిగ్రీల కన్నా ఎక్కువగా ఉంటుందని, అత్యల్పం 15 డిగ్రీలుగా ఉంటుందని అంచనా అధికారులు వేసింది. రాష్ట్రంలో వాతావరణం మళ్లీ మారనుంది. ఇక మెల్లగా చలి కాలం నుంచి ఎండా కాలానికి మారనుంది. సాధారణంగా ఫిబ్రవరి మొదటి రెండు వారాల్లో అంతగా ఎండ ఉండదు, కానీ ఈ సారి మాత్రం వేసవి కాలం కాస్త ముందుగా, మరింత జోరుగా మొదలవ్వనుంది. మరో ఐదు రోజుల వ్యవధిలో ఉష్ణోగ్రతలు 4-5 డిగ్రీలు రాష్ట్ర వ్యాప్తంగా పెరగనుంది. అనంతపురం నుంచి నెల్లూరు మధ్యలో, నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు ఉష్ణోగ్రతలు ఒక సారిగా వేడికానుంది. ఇప్పుడే 40 డిగ్రీలు రావు కానీ 37 డిగ్రీల వరకు పలు ప్రాంతాల్లో నమోదవ్వనుంది. ముఖ్యంగా విజయవాడ - గుంటూరు ప్రాంతం, అలాగే నంధ్యాల జిల్లాలో రాష్ట్రంలోని మిగిలిన భాగాలకంటే వేడిగా ఉండనుంది. మరోవైపున చలి కూడా ఉంటుంది. రాత్రి వేళల్లో చల్లగా ఉండే వాతావరణం ఉంటుంది." అని ఏపీ వెదర్ మ్యాన్ తెలిపారు.

## ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి

**పెద్దపల్లి**

జిల్లాలోని నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. గురువారం ఆయన పెద్ద కల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్ 2, 3, 4 సర్వీస్ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షల కొరకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా శిబిరాన్ని డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు గ్రూప్స్ క్రింద ఉన్న ఖాళీల నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసిందని, పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వీలుగా మన జిల్లాలో నిరుద్యోగ యువతకు ఫిబ్రవరి 9 నుండి మే 8 వరకు గ్రూప్స్ కొరకు నాణ్యమైన శిక్షణను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించుకున్నామని, ఇప్పటి వరకు 69 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారని, మరో 31 మందికి సైతం అవకాశం ఉందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, కెప్టెన్ ఆర్. సంజీవ్, బిసి అభివృద్ధి అధికారి రంగా రెడ్డి, ఎస్.సి. అభివృద్ధి శాఖ అధికారి నాగలేశ్వర్, కోచింగ్ శిక్షకులు సదానందం, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కోవిషీల్డ్ తో గుండె వ్యాధులు

**ముంబై :**

కొవిడ్ వ్యాక్సిన్‌లు వేసుకుంటే చాలా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని టీకాలు వేసిన మొదట్లో ఎన్నో అనుమానాలు వ్యక్తమయ్యాయి. వాట్సాప్‌లోనూ చాలా వదంతులు పుట్టుకొచ్చాయి. కొద్ది రోజుల పాటు ఈ సందేహాలు అలాగే కొనసాగాయి. ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు ప్రయత్నాలు చేయడం వల్ల పరిస్థితుల్లో కొంత మార్పు వచ్చింది. క్రమంగా అందరూ ముందుకొచ్చి టీకాలు తీసుకున్నారు. అయితే...వ్యాక్సిన్‌ల వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయన్న వాదనను ఇప్పటికీ కొందరు నిపుణులు బలంగా వినిపిస్తున్నారు. భారత సంతతికి చెందిన బ్రిటన్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అసీమ్ మల్హోత్రా ఇటీవల చేసిన వ్యాఖ్యలు సంచలనమవుతున్నాయి. ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌లను వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు మల్హోత్రా. భారత్‌లో ఎక్కువ మందికి అందించిన కొవిషీల్డ్ టీకాల కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదముందని తేల్చి చెప్పారు. ఈ టీకా నేరుగా గుండెపైనా అధికంగా ప్రభావం చూపుతుందని సంచలన విషయం చెప్పారు. ఫైజర్ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌ను కూడా బ్యాన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు మల్హోత్రా. వ్యాక్సిన్‌లపై రివ్యూ చేసి ఈ విషయం వెల్లడించారు. మరోసారి కొవిషీల్డ్ వ్యాక్సిన్‌కు సేఫ్టీ రివ్యూ అవసరమని స్పష్టం చేశారు. నేషనల్ హెల్త్ సర్వీస్ లో ట్రైనింగ్ పూర్తి చేసిన మల్హోత్రా...ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. కొవిడ్ వ్యాక్సిన్‌లపై కీలక ప్రసంగాలు ఇస్తున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్‌లు బ్యాన్ చేయాలన్న డిమాండ్ వినిపిస్తోందని తెలిపారు. కొవిషీల్డ్ వ్యాక్సిన్, ఫైజర్ టీకాల్లో ఏది సమర్థమంతమైనది..? ఏది గుండెపై అధికంగా ప్రభావం చూపుతోంది అనే అంశాలపై అధ్యయనం చేశారు మల్హోత్రా. ఈ రెండింటినీ పోల్చి చూస్తే...కొవిషీల్డ్ టీకా గుండెపై ఎక్కువగా ఎఫెక్ట్ చూపిస్తోందని వెల్లడైంది. పెద్దలతో పాటు పిల్లలకూ ఈ ముప్పు ఉందని తేలింది. వాల్వ్ క్లాట్ అవ్వడం, గుండె పోటు రావడం లాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు డాక్టర్ మల్హోత్రా. యూకే సహా ఐరోపా దేశాలు ఆస్ట్రాజెన్‌కా తయారు చేసిన కొవిషీల్డ్ టీకాను బ్యాన్ చేసినప్పుడు ఇండియాలో మాత్రం ఎందుకు ఇచ్చారని ప్రశ్నిస్తున్నారాయన. సైడ్ ఎఫెక్ట్స్ ఉంటున్నాయన్న కారణంగానే ఆయా దేశాల్లో ఆ టీకా పంపిణీని ఆపేసినట్టు వివరించారు. ఇప్పటికిప్పుడు ఈ టీకాలను బ్యాన్ చేయాలని సూచించారు. అయితే...గతేడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఊబా)ఓ కీలక విషయం చెప్పింది. కొవిషీల్డ్ టీకా అన్ని విధాలుగా సేఫ్ అని వెల్లడించింది. దీనిపైనా విమర్శలు చేశారు డాక్టర్ అసీమ్ మల్హోత్రా. కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు బడా సంస్థల్ని తమ చెప్పు చేతల్లో ఉంచుకుంటున్నారని అన్నారు. కేవలం షేర్ హోల్డర్లకు లాభం చేకూర్చేందుకే ఫార్మా ఇండస్ట్రీని పావుగా వాడుకుంటున్నారన్న చేదు నిజాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఘాటుగా స్పందించారు. ఈ రెండు వ్యాక్సిన్‌లను అప్రూవ్ చేయకుండా ఉండాల్సిందని అన్నారు.

## ఐదులక్షల గోగిపూలతో బిక్షేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

**మంథని**

మంథని దక్షిణ కాశీగా పేరుందిన శ్రీ బిక్షేశ్వర స్వామి ఆలయంలో ఐదు లక్షల గోగిపూలతో బిక్షేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. మంథని పట్టణానికి చెందిన కొమురవెల్లి శ్రీనివాస్-స్వప్న దంపతుల ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులందరూ కలిసి మాఘ మాసాన్ని పురస్కరించుకొని ఐదు లక్షల గోగుపులతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిక్షేశ్వర స్వామికి రుద్రాభిషేకాన్ని నిర్వహించి, లక్ష వత్తిని ముట్టించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పల్లి సంజీవ్ ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహించారు. ఈ గోగిపూల పూజల అనంతరం స్వామి వారిని పట్టణంలోని భక్తులందరూ దర్శించుకుని తరించారు. బిక్షేశ్వర స్వామి దేవాలయంలో కోరుకున్న కోరికలకు కార్యసిద్ధి లభిస్తుందని భక్తులు నమ్ముతారు.

## భారీగా పతనమైన టమాట ధర



**కర్నూలు**

ఎమ్మిగనూరు మార్కెట్ లో టమోటా ధర భారీగా పతనమైంది. గత 10 రోజులుగా ఎమ్మిగనూరు మార్కెట్ లో టమోటాకు ధర లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో రూపాయి పలకడంతో టమోటా రైతులు రవాణా ఖర్చు కూడా రావడం లేదని వాపోతున్నారు. కొందరు తెచ్చిన టమోటా బాక్స్ లను మార్కెట్ లోనే వదిలి వెళ్లిపోతుండగా.. కొందరు రోడ్డుపైనే పారబోస్తున్నారు. ఇప్పటికైనా గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం తమను ఆదుకోవాలని టమోటా రైతులు కోరుతున్నారు

## ఆదర్శ నియోజకవర్గం పాలేరు

**ఖమ్మం**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి లోని వసుంధర ఒకేషనల్ కళాశాల వార్షికోత్సవం కార్యక్రమంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కావద్దు. చిత్త శుద్దితో పనిచేస్తే ఉన్నత స్థాయి కి ఎదుగుతారు. ప్రజాప్రతినిధిగా రెండు మూడు సంవత్సరల్లోనే అభివృద్ధి చేశా. రామదాసు జీవిత చరిత్ర కోసం నాలుగు కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టాం. నేలకొండపల్లి లో డిగ్రీ,ఇంటర్ కళాశాల కు భవనాలు ఏర్పాటు చేసాం. ప్రజల కోరిక మేరకు జాతీయ రహదారి ని ఊరు బయట నుంచి రూట్ మార్చాను. పాతకాలువ 70 కోట్ల తో పూర్తి చేశా. ప్రతి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాం. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం లో ఎక్కువ శాతం నీటి పారుదల సౌకర్యం కలిగిన నియోజకవర్గం పాలేరు. పేదరికాన్ని పారద్రోలటానికి నియోజకవర్గం అభివృద్ధి చేశానని అన్నారు. ఇంకో నాలుగు సంవత్సరాలు తరువాత పాలేరు నియోజకవర్గం లాంటి నియోజకవర్గం మరొకటి ఉండదు. సీతారామా కూడా పూర్తి చేసి గోదావరి జలాలను పాలేరుకు తీసుకొస్తానని అన్నారు. ఆనాడు ఇచ్చిన మాట కోసం పెద్ద పాలేరు గా పనిచేశా. ఆదర్శవంత మైన నియోజకవర్గం గా పాలేరు ను తీర్చిదిద్దాను. మళ్లీ అవకాశం ఇవ్వాలని ఆ భగవంతుడు ని కోరుకుంటున్నానని అన్నారు.

## కలకలం రేపిన కోతుల కళేబరాలు

**గోపాలపట్నం**

పశ్చిమగోదావరి జిల్లా పేరుపాలెం బీచ్ లో వానరుల కళేబరాలు కలకలం రేపాయి. బీచ్ కు సమీపంలోని సర్వే తోటల్లో 50 కి పైగా కోతుల మృతదేహాలు చెల్లా చేదురుగా పడి ఉన్నాయి.. దుర్వాసన రావడంతో స్థానికులు తోటల్లో వెతకగా కోతుల కళేబరాలు కనిపించాయి.. అయితే స్థానికంగా కోతులు బెడద లేదు. దీంతో ఇతర ప్రాంతంలో విష ప్రయోగం చేసి చనిపోయిన వానరులను రాత్రి సమయంలో అక్కడ పడేసి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు...

## రాయల విగ్రహావిష్కరణకు భారీ ఏర్పాట్లు

**మదనపల్లె**

పట్టణంలో శ్రీ కృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం త్వరలో వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్ అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి, స్థానిక బలిజ సేవాసంఘం నాయకులతో కలిసి విగ్రహ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. విగ్రహావిష్కరణకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్ బాషా సహకారం మరువ లేనిదన్నారు. బలిజ సేవా సంఘం విగ్రహ ఏర్పాటుకు సహకరించాల్సిందిగా ఎంపీ మిథున్ రెడ్డిని కోరిన వెంటనే ఆయన తన సొంత నిధులతో విగ్రహాన్ని అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

# 14 వ రోజు కొనసాగిన నారా లోకేష్ పాదయాత్ర

**గంగాధర నెల్లూరు**

టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 14 వ రోజు యువగళం పాదయాత్ర గురువారం ప్రారంభం అయింది. ఆత్మకూరు ముత్యాలమ్మ గుడి లో పూజలు జరిపి అయన యాత్ర ప్రారంభించారు. ఉదయం అయనను ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాల ప్రతినిధులు కలిసారు. గత టిడిపి హయాంలో ప్రైవేట్ విద్యా సంస్థల అనుమతుల పునరుద్ధరణ 10 ఏళ్లకు ఒక సారి జరిగేది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత 3 ఏళ్లకు ఒకసారి అనుమతులు రెన్యువల్ చేసుకోవాలని నిబంధన పెట్టారని వారన్నారు. తో ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. అనుమతుల కోసం కార్యాలయాల చుట్టూ పదేపదే తిరగాల్సి వస్తుంది. పాత పద్ధతినే కొనసాగించేలా చర్యలు తీసుకోండి. ఫైర్ డిపార్ట్మెంట్ అనుమతులు కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రైవేటు విద్యాసంస్థలకు విద్యుత్ బిల్లుల స్లాబ్ ను 2 నుండి 7కి మార్చాలని వారు కోరారు.

లోకేష్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి విద్యావ్యవస్థను సర్వనాశనం చేసింది. జె-ట్యాక్స్ కోసం ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు వేధింపులకు గురిచేస్తోంది. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పదేళ్లకోసారి రెన్యువల్ విధానాన్ని పునరుద్దరిస్తాం. ఫైర్ ఎన్ ఓసి, ఇతర సాకులతో జరుగుతున్న వేధింపులు లేకుండా చేస్తాం. విద్యుత్ బిల్లుల అంశాన్ని పరిశీలించి ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

# ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం..

**మేడ్చల్**

ఘట్కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఔషపూర్ గ్రామంలో వుంటున్న మౌలాన్, శాంతి కుటుంబం , వృత్తిరీత్యా కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తోంది. శాంతి తన ప్రియుడు బాబు తో అక్రమ సంబంధం పెట్టుకుందని కొన్ని రోజులుగా పలుమార్లు ఇంట్లో గొడవలు జరిగాయి. దాంతో విసిగెత్తిన భార్య శాంతి , తన భర్తను హతమార్చాలని నిర్ణయించుకుంది. భర్త తాగే మద్యంలో మందులో విషం కలిపింది. భర్త చనిపోయాడు. ఆ విషయం బయటకు రాకుండా శాంతి తన భర్త కడుపునొప్పితో చనిపోయారని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు , మృతి చెందిన మౌలాన్ మృతదేహాని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం రిపోర్ట్ చూసి పోలీసులు నివ్వెరపోయారు. తరువాత విచారణ నిమిత్తం భార్య శాంతిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు బయటకు వచ్చాయి. పోలీసులు భార్య శాంతి తన ప్రియుడు బాబును అదుపులోకి తీసుకున్నారు. .తమ అక్రమ సంబంధంకు అడ్డు వస్తున్నాడని అడ్డు తొలగించుకునేందుకు ప్రియుడు బాబు తో కలిసి భర్తను చంపినట్లు శాంతి అంగీకరించింది.

# బీచ్ శాండ్ మైనింగ్లో అక్రమాలను ఎలా నిరోధిస్తారు?

**మంత్రికి శ్రీ విజయసాయి రెడ్డి ప్రశ్న**

**న్యూఢిల్లీ,**

అరుదైన ఖనిజాలు, మూలకాలు లభించే బీచ్ శాండ్ మైనింగ్లో ప్రైవేట్ సంస్థలు పాల్గొనేలా అనుమతిస్తున్న కేంద్ర ప్రభుత్వం అందులో అక్రమాలు జరగకుండా నిరోధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటోంది అని గురువారం రాజ్యసభ ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్సీపీ సభ్యులు శ్రీ వి.విజయసాయి రెడ్డి అనుబంధ ప్రశ్న వేశారు. దీనికి పీఎంవో సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ జవాబిస్తూ సభ్యుడు లేవనెత్తిన ప్రశ్న సరైనదేనని అన్నారు. గడచిన ఏడెనిమిదేళ్ళలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే బీచ్ శాండ్ మైనింగ్లో అక్రమాలు జరగకుండా నిరోధించేందుకు తీసుకుంటున్న చర్యలలో ఎలాంటి మెరుగుదల కనిపిస్తోందో స్పష్టమవుతుందని అన్నారు. గ్రానైట్ తవ్వకాల కోసం లైసెన్సు పొందిన ప్రైవేట్ సంస్థలు అణు రియాక్టర్లలో వినియోగించే థోరియం తయారీకి అవసరమైన మోనజైట్ వంటి నిక్షేపాలను భారీగా స్మగ్లింగ్ చేశారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అరుదైన ఖనిజాలు, మూలకాల స్మగ్లింగ్ను నిరోధించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి చెప్పారు. మైనింగ్ చేస్తున్న ఖనిజ నిక్షేపాలలో వాటి వివిధ ఆకృతులను నిర్ధారించేందుకు శాటిలైట్ ఇమేజింగ్ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. అరుదైన ఖనిజ నిక్షేపాల మైనింగ్లో పాల్గొంటున్నది ప్రైవేట్ సంస్థా లేక ప్రభుత్వ రంగ సంస్థా అన్న దానితో నిమిత్తం లేకుండా స్మగ్లింగ్ను నిరోధించేందుకు చేపడుతున్న చర్యలలో తోడ్పడవలసిందిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారాన్ని పదేపదే కోరుతున్నామని అన్నారు.

# నూతన మసీదు నిర్మాణానికి ప్రత్యేక ఫాతేహాలు

**కౌతాళం**

ఎమ్మెల్యే సహకారం గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ ఉంటుందని సర్పంచ్ పాల్ దినకర్ పేర్కొన్నారు గురువారం పింజారి కాలనీలో 15 సెంట్లు భూమిలో నూతన మసీదు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు దేశయి ప్రహ్లాద ఆచారి వైసిపి నాయకులు హాజరయ్యారు. పింజారీ గేరీ కాలనీలో 15 సెంట్లు భూమిని దూద్ అఖిల్ కమ్యూనిటీ మసీదు నిర్మాణం నిమిత్తము కేటాయించడం జరిగింది. వారు పేర్కన్నారు. కేటాయించిన స్థలంలో మసీదు నిర్మాణం పనులను దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి మరియు జగద్గురు పీఠాధిపతి మున్నా దాదా , మరియు మాబుసాబ్ ,సర్పంచ్ పాల్ దినకర్ ,దూద్ అఖిల్ అధ్యక్షుడు సాయిబాబా వారి ఆధ్వర్యంలో మౌలి సబ్ ప్రత్యేక ప్రత్యేక



ఫాతిహాలు నిర్వహించారు. అనంతరం భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మార్వో శేక్షావలి , ఉప సర్పంచ్ సక్కరి తిక్కయ్య , వైస్ ఎంపీపీ బుజ్జీ స్వామి, సత్యప్ప స్వామి, మాజీ సర్పంచ్ అవతారం,హై స్కూల్ చైర్మన్ వడ్డే రామన్న, ఉమాపతి, చౌదరి బసవ , సమ్మద్, వెంకొబ్, ఈరన్న,రాజమ్మద్ ,వార్డ్ మెంబర్ రామక్రిష్ణ, భాషా, వీరేష్ తదితరులు భూమి పూజ లో పాల్గొన్నారు.

# కార్మికుల క్లెయిమ్స్ ను వెంటనే పరిష్కరించాలి

**జగిత్యాల,**

జగిత్యాల జిల్లాలోని వెల్ఫేర్ బోర్డుల్లో పెండింగ్లో ఉన్న భవన నిర్మాణ కార్మికుల క్లెయిమ్స్ ను వెంటనే పరిష్కరించాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎం.డి.ముక్రం కోరారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టిన అనంతరం కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముక్రం మాట్లాడుతూ 2018 నుంచి జిల్లాలోని వెల్ఫేర్ బోర్డుల్లో కార్మికులకు రావాల్సిన డబ్బుల క్లెయిమ్స్ పెండింగ్లో ఉన్నాయన్నారు. భవన నిర్మాణ రంగంలోని కార్మికులలో కొందరు ప్రమాదవశాత్తు, సహజ మరణం పొందడం జరిగిందన్నారు. అలాగే మెటర్నిటీ, మ్యారేజి బెనిఫిట్స్ కోసం దరఖాస్తు చేసుకొన్నవారు చాలామంది ఉన్నారని బెనిఫిట్స్ రాలేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 2023 జనవరి 31 వరకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరకాస్తులన్నింటిని మీ సేవల్లో రినివల్ చేయాలని ముక్రం కోరారు. అలాగే రేషన్ కార్డు తప్పనిసరి అనే నిబంధనను తొలగించాలని కోరారు. జిల్లా లోని నోడల్ అధికారులు, ఏ. ఎల్.ఓ ల పనివిదానంతో కార్మికులు నష్టపోతున్నారని ముక్రం ఆవేదన వ్యక్తం చేశారు.

# 13న వైసీపీ విస్తృత స్థాయి సమావేశం

**విజయవాడ :**

ఈ నెల 13న జరిగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో సీఎం వైఎస్ జగన్ ఏం చెప్పనున్నారు.. ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారు.. కొంతమంది ఎమ్మెల్యేలకి ఇబ్బందులు తప్పవా అని పార్టీలో చర్చ మొదలైంది.ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎన్నికల కసరత్తు వేగవంతం చేశారు. వై నాట్ 175 నినాదంతో ముందుకు వెళ్తుమన్న జగన్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలను గడప గడపకు ప్రభుత్వం పేరుతో ప్రజల వద్దకు పంపిన సీఎం జగన్.. త్వరలో తాను ప్రజల మధ్యకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. అందులో భాగంగా పార్టీ ముఖ్య నేతలతో ఈ నెల 13 న కీలక సమావేశం ఏర్పాటు చేస్తున్నారు . ఇప్పటికే ఎమ్మెల్యేల పని తీరు పైన సీఎం జగన్ క్షేత్ర స్థాయి సర్వే నివేదికలు తెప్పించుకున్నారు. కొంత మంది ఎమ్మెల్యేల పనితీరు పైన ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. నెల్లూరు జిల్లాలో తాజాగా చోటు చేసుకున్న పరిణామాలతో కఠిన నిర్ణయాలకు సీఎం జగన్ సిద్ధమయ్యారు. ఇదే సమయంలో ప్రజల్లో ఎమ్మెల్యేల గ్రాఫ్ పైన ఫోకస్ పెట్టారు. ఈ సమావేశంలో ఆ అంశమే కీలకం కానుంది.ఇప్పటికే పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లతో సమావేశమైన సీఎం జగన్, ఈ సారి మంత్రులు, ఎమ్మెల్యేలతో మీటింగ్ కు నిర్ణయం తీసుకున్నారు. గత సమావేశంలో ప్రతి సచివాలయ పరిధిలో కన్వి నర్లు, గృహ సారథుల నియమాకంపై నిర్ణయించినా ఇప్పటికీ నియామకాలు పూర్తి కాలేదు.రీజనల్ కో ఆర్డినేటర్ల సమావేశంలో వీరి నియామకం పైన సీఎం జగన్ గట్టిగానే హెచ్చరించారు. ఇప్పుడు ఇదే అంశం పైన మరోసారి ఎమ్మెల్యేలకు స్పష్టత ఇవ్వనున్నారు. అదే సమయంలో గత సమావేశంలో దాదాపు 28 మంది ఎమ్మెల్యేల పనితీరుకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్ దగ్గర సర్వే వివరాలు ఉన్నాయి. ప్రజల్లో గ్రాఫ్ పెరగకపోతే సీట్లు ఇవ్వటం కష్టమని తేల్చి చెప్పారు. పనితీరు మెరుగు పర్చుకోవటానికి వారికి మరో అవకాశం ఇచ్చారు. దీంతో ఈ సమావేశంలో జగన్ ఏం చెప్పబోతున్నారనేది పార్టీ వర్గాలతో పాటుగా, ఎమ్మెల్యేల్లో హైటెన్షన్ పెరిగిపోతోంది.వైసీపీ ఎమ్మెల్యేలు నియోజకవర్గ ఇంఛార్జ్ లకు సంబంధించిన ప్రోగ్రస్ రిపోర్టులు ఐపాక్ తో పాటుగా మరో రెండు సర్వే సంస్థలు ముఖ్యమంత్రికి నివేదికలు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా ఎమ్మెల్యేలు ప్రజలతో, పార్టీ కేడర్ తో మమేకం అవుతున్న విధానంతో పాటుగా వారికి ప్రజల్లో ఉన్న ఆదరణ ఆధారంగా మార్కులు ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి ఎమ్మెల్యేల పని తీరు పైన ఫైనల్ వార్నింగ్ ఇచ్చే అవకాశం లేకపోలేదన్నది పార్టీ నేతల వాదన. ఎన్నికలకు ఆరు నెలల ముందే టికెట్లు ఖరారు చేస్తామని ఇప్పటికే సీఎం స్పష్టం చేశారు. ప్రతిపక్ష టీడీపీ సిట్టింగ్ లకు సీట్లు ఖరారు చేయటంతో పాటుగా కొత్తగా ఇంఛార్జ్ లను నియమించే పనిలో ఉంది. ఈ క్రమంలో ప్రత్యర్ధి పార్టీల వ్యూహాలను గమనిస్తూ గెలుపే లక్ష్యంగా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక, గెలుపు దిశగా నిర్ణయాలు ఉంటాయని ముఖ్యమంత్రి జగన్ పదే పదే చెబుతున్నారు. గెలుపు గుర్రాలకే టికెట్లు అనే విదానం అభ్యర్థుల ఎంపికకు కీలక సూత్రంగా చెబుతున్నారు. ఈ వ్యవహారం పై సీఎం జగన్ క్లారిటీ ఇవ్వనున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి.ప్రభుత్వ వ్యవహారాలతో పాటు పార్టీ పనులను సమన్వయం చేసుకుంటూ నేతలంతా ప్రజల్లోనే ఉండేలా సీఎం జగన్ కార్యాచరణ సిద్ధం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందులో భాగంగా ముఖ్యమంత్రి జగన్ సైతం ఇక రాష్ట్ర వ్యాప్త పర్యటనకు సిద్ధం కానున్నారు. ముఖ్యమంత్రి జగన్ పల్లెనిద్ర చేయాలని కీలకంగా నిర్ణయించారని అంటున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు పూర్తయిన తరువాత ముఖ్యమంత్రితో పాటుగా ఎమ్మెల్యేలంతా ప్రజల్లోనే ఉండేలా రూట్ మ్యాప్ రెడీ చేయబోతున్నారన్నది పార్టీ వర్గాలో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేలకు సీట్లు ఇవ్వలేని వారికి ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చే గుర్తింపు పైన సంకేతాలు కూడా సిద్దం చేసుకుంటున్నారు. దీని వలన రెబల్స్ లెక్కలు క్లియర్ అవుతాయని పార్టీ భావిస్తోంది. ఈ సమావేశంలో పార్టీ అధినేత జగన్ ఏం ప్రకటన చేయబోతున్నారనేది మరో నాలుగు రోజుల్లో తేలనుంది. ఈ నెల 20న వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనికి సంబంధించి నేతలకు జగన్ దిశా నిర్దేశం చేయనున్నారు

# ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు సీబీఐకి ఇవ్వాలి

**వరంగల్ :**

ఎమ్మెల్యే ల కొనుగోలు వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ నుంచి టిఆర్ఎస్ లో కలిసిన 12 మంది ఎమ్మెల్యేలపై కూడా విచారణ జరపాలని కోరుతూ తెలంగాణ డీజీపీ కి టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి లేఖ రాశారు. 12 మంది ఎమ్మెల్యేలను అధికార పార్టీ ప్రబలకు గురి చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి అక్రమంగా చట్ట వ్యతిరేకంగా టిఆర్ఎస్ పార్టీ లో చేర్చుకున్న అంశంలో గతంలోనే ఫిర్యాదు చేశామని లేఖలో రేంత్ రెడ్డి గుర్తు చేశారు. జనవరి 6వ తేదీన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ఈ విషయమై ఫిర్యాదు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే లకు ఆర్థిక, రాజకీయ ప్రలోభాలు ఆశ చూపి టిఆర్ఎస్ లో చేర్చుకున్నారని ఈ విషయంలో తాము ఇప్పటికే హైకోర్టులో పిటిషన్ కూడా వేశామన్నారు. అందువల్ల ఈ ఎమ్మెల్యేల కొనుగోలు కు సంబంధించి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ఎఫ్.ఆర్.ఐ కేసు నెంబర్ 455 లో తమ ఫిర్యాదు ను కూడా జత చేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ప్రలోభాల విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, 12 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ చేయాలని రేవంత్ కోరారు. టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి 2018 వరకు 4 ఎంపీలు, 25 మంది ఎమ్మెల్యేలు, 18 మంది ఎమ్మెల్సీ లను వివిధ పార్టీ ల నుంచి టిఆర్ఎస్ లో చేర్చుకున్నారని.. 2018 లో ఎన్నికలు జరిగాక మళ్ళీ 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టిఆర్ఎస్ లో చేర్చుకున్నారని రేవంత్ రెడ్డి డీజీపీకి తెలిపారు. 12 మంది ఎమ్మెల్యేలకు టిఆర్ఎస్ ప్రభుత్వం వివిధ రకాల లబ్ది చేకూర్చారన్నారు. 12 మంది ఎమ్మెల్యేలు లు నేరాలకు అలవాటు పడ్డ వారుగా గుర్తింపు పొందారు. 12 మందిలో 3 ఎమ్మెల్యేలు గతంలో పార్టీ మారి మళ్ళీ ఇప్పుడు బీజేపీ పార్టీ లోకి మరెందుకు జరిగిన వ్యవహారంలో కూడా ఉన్నారని తెలిరు. ఈ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో కేసు ను సీబీఐకి ఇస్తున్నందున.. 12 మంది పార్టీ మారిన ఎమ్మెల్యేల అంశాలను కూడా జత చేసి సీబీఐ.కి ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరుతున్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసు సీబీఐకి చేతికి వెళ్లకుండా ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ఐదు సార్లు సీబీఐ లేఖలు రాసినా కేసును ఇంత వరకూ హ్యాండోవర్ చేయలేదు. మరో సుప్రీంకోర్టులోనూ ఊరట లభించలేదు. పదిహేడో తేదీన హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ జరపనున్నారు. ఈ లోపు సీబీఐ విచారణ ప్రారంభిస్తే.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేరిక అంశాన్ని కూడా అందులో కలిపి సీబీఐ విచారణ జరిపేలా చూడాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. రేవంత్ రెడ్డి విజ్ఞప్తిని పోలీసులు పట్టించుకునే అవకాశం లేదు. అయితే ఎమ్మెల్యేల కొనుగోలు అంశంలో.. కేసీఆర్ .. గతంలో చాలా మందిని ఇలా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకున్నారన్న అంశంపై ప్రజల్లో విస్తృత చర్చ జరిగేలా చేస్తున్నారు.

# కడియం శ్రీహరికి షర్మిల స్ట్రాంగ్ కౌంటర్

**వరంగల్ :**



ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ఆర్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల... మాజీ మంత్రి కడియం శ్రీహరిపై తీవ్ర విమర్శలు చేశారు. పదవిలో ఉండి కూడా ఏం చేయలేని కడియం శ్రీహరి లాంటోళ్లే అసలైన తెలంగాణ ద్రోహులంటూ విరుచుకుపడ్డారు.మాజీ మంత్రి కడియం శ్రీహరి చాలా పెద్ద మనిషి అనుకున్నానని అన్నారు షర్మిల. ఏళ్ల తరబడి మంత్రిగా ఉండి కూడా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు తీసుకురాని చేతగాని వ్యక్తి తెలంగాణ వ్యతిరేకా... నీటి ప్రాజెక్టు నిర్మించి లక్షల ఎకరాలను తడిపిన రాజశేఖర్ రెడ్డి తెలంగాణ వ్యతిరేకా అని ప్రశ్నించారు షర్మిల. ఆ కాలంలోనే వరంగల్ జిల్లాకు పాలిటెక్నిక్ కాలేజీ తీసుకొచ్చారని షర్మిల గుర్తు చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉండి కూడా డిగ్రీకాలేజ్, ఇంటర్ కాలేజీ పెట్టించలేని కడియం శ్రీహరి తెలంగాణ వ్యతిరేకా అని ప్రశ్నించారు. ఉద్యమం పేరు చెప్పి అధికారాన్ని అనుభవిస్తున్న కడియం శ్రీహరి లాంటోళ్లు తెలంగాణ ద్రోహులు అని అన్నారు. ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను కేసీఆర్ వెన్నుపోటు పొడిస్తే వైఎస్ఆర్ బిడ్డగా వాటిని చూస్తు తట్టుకోలేక తెలంగాణలో పార్టీ పెట్టానన్నారు షర్మిల. ఈ తెలంగాణ గడ్డమీదనే పుట్టిందని... ఇక్కడే చదువుకుంది... ఇక్కడే పెళ్లి చేసుకొని పిల్లలని కూడా కనిందన్నారు. అందుకే తెలంగాణ గడ్డకు సేవ చేయాలన్న సంకల్పంతోనే పార్టీ పెట్టానన్నారు. కేసీఆర్ తాను ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కాబట్టే పాదయాత్ర చేస్తూ ఆయన వైఫల్యాలను, ప్రభుత్వం ఇచ్చిన ఎండగడుతున్నామన్నారు. అందుకే తమపై రకరకాల ప్రచారాలు, దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మధ్య మీడియాతో మాట్లాడిన కడియం శ్రీహరి... జగన్ గ్రాఫ్ పడిపోతోందని.. జగన్ జైలుకు వెళ్తే సీఎం చాన్స్ వస్తుంది.. ఏపీకి వెళ్లాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలుషర్మిలకు కడియం సలహా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాదయాత్ర చేస్తున్న షర్మిల బడ్జెట్పై విమర్శలు చేశారు. దీనికి కౌంటర్గా మీడియా సమావేశం నిర్వహించిన కడియం శ్రీహరి.. షర్మిల ఏపీలో రాజకీయాలు చేయాలనిసలహా ఇచ్చారు. వైఎస్ కుటుంబం తెలంగాణకు మొదటి నుంచి వ్యతిరేకమేనని చెప్పారు. పాదయాత్ర చేసి అన్నను సీఎంను చేసిన షర్మిల ఆంధ్రాకు వెళ్లి అక్కడి ప్రజలతో మొర పెట్టుకోవాలని సూచించారు. జగన్ గ్రాఫ్ పడిపోతోందని, రేపో మాపో ఆయన జైలుకు వెళ్తే షర్మిలకు పదవి దక్కే అవకాశముందని అన్నారు. తెలంగాణ బిల్లు ఆమోద విషయంలో వైఎస్ జగన్,షర్మిల సమైక్య నినాదానికి తెరలేపిన వారని కడియం శ్రీహరి గుర్తు చేశారు. అలాంటి షర్మిల నేడు తెలంగాణలో వైఎస్ శర్మిలకు ఓటు అడిగే నైతిక హక్కు ఉందా అని ప్రశ్నించారు. షర్మిల కుటుంబ పరంగా నష్టపోయారని.. ...తన అన్న జగన్... ఆమెను రాజకియంగా దెబ్బ తీశారన్నారు. గతంలో శర్మిల పాదయాత్ర తోనే జగన్ సీఎం అయ్యాడన్నారు. ఆ సానుభూతి ఇక్కడ పనిచేయదు...రేపో మాపో సిఎం జగన్ జైలుకు పోయే అవకాశాలు ఉన్నాయి ..కాబట్టి.. ఏపీకి వెళ్లాలన్నారు. షర్మిలకు రాజకియ భవిష్యత్తు ఆంధ్రాలో ఉంటుందన్నారు. ఈ ప్రయత్నాలు అక్కడ చేసుకోవడం బెటర్ అని సూచించారు. తెలంగాణలో పాదయాత్రలు చేస్తూ షర్మిల సమయాన్ని వృథా చేసుకోవద్దని కడియం సూచించారు. వైఎస్ఆర్టీపీ అధినేత్రి షర్మిల నర్సంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల దాడులు చేయడంతో నిలిచిపోయింది. అనంతరం షర్మిల హైకోర్టుకు వెళ్లి పాదయాత్రకు అనుమతి తెచ్చుకున్నారు. నర్సంపేట నియోజకవర్గం, చెన్నారావు పేట మండలం శంకరమ్మతండా వద్ద నుంచి మళ్లీ ప్రారంభించారు. ఈ నెలాఖరు కల్లా పెండింగ్ నియోజకవర్గాల్లో పాదయాత్రను పూర్తి చేసి మహబూబాబాద్ నియోజకవర్గం మీదుగా పాలేరు నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారు. ప్రజాప్రస్థానం ముగింపు సభ ఖమ్మం రూరల్ మండలంలో జరగనుంది. వచ్చే ఎన్నికల్లో షర్మిల పాలేరు నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు.

## బీఎస్పీ సభను విజయవంతం చేయాలి

**మదనపల్లె**

ఫిబ్రవరి 20న మదనపల్లెలో జరుగు బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర ముగింపు సభ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిఎస్పి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతం పిలుపునిచ్చారు. నేడు మదనపల్లె బిఎస్పి కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మదనపల్లి నియోజకవర్గ అధ్యక్షులు సహదేవ, జిల్లా ఇన్చార్జి బాలాజీ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పునీత్, జిల్లా సెక్రటరీ శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌతం మాట్లాడుతూ రాజ్యాధికార చైతన్య యాత్ర మదనపల్లి పట్టణంలోని టిప్పు సుల్తాన్ గ్రౌండ్ నుండి సాయంత్రం 4 గంటలకు భారీ ర్యాలీగా మొదలై మిషన్ కాంపౌండ్ నందు సాయంత్రం 5 గంటలకు భారీ బహిరంగ సభతో ముగుస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వైకాపా విజయానికి కృషి చేయాలి

**మదనపల్లె**

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి 175 స్థానాల్లో గెలుపొందే విధంగా ప్రతి ఒక గృహసారధి, కన్వీనర్లు కృషి చేయాలని అన్నమయ్య జిల్లా మదనపల్లే ఎమ్మెల్యే నవాజ్ భాషా పిలుపునిచ్చారు. నేడు మదనపల్లె రూరల్ మండలం బసినికొండ పంచాయతీలోని ఓ ప్రయివేటు ఫన్షన్ హాలు నందు గృహ సారధుకలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి నియోజకవర్గ వైసిపి ఎన్నికల పరిశీలకులు హబీబ్ భాష, వైస్ ఎంపిపిలు డిష్ రమణ, నందినీతాజ్, సర్పంచులు శరత్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టిశ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 మందికి ఒక గృహ సారధిని నియమించిన్నట్లు తెలిపారు. వీరు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తెలియజేయాలని సూచించారు.

## లోకేష్ పాదయాత్రలో ఉద్రిక్తత

**గంగాధర నెల్లూరు**

టీడీపీ యువనేత నారా లోకేశ్ పాదయాత్రలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జీడీ నెల్లూరు నియోజకవర్గం సంసిరెడ్డిపల్లిలో ఆయన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. స్టూల్ పైకి ఎక్కి లోకేశ్ మాట్లాడుతుండగా... ఆ స్టూల్ ను పోలీసులు లాగేసే ప్రయత్నం చేశారు. మైక్ తీసుకొస్తున్న బాషా అనే కార్యకర్త నుంచి మైక్ ను లాక్కున్నారు. దీంతో పోలీసులపై లోకేశ్, టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. స్టూల్ మీదే నిలబడి లోకేశ్ నిరసన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం పుస్తకాన్ని చూపిస్తూ పోలీసులపై లోకేశ్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

పోలీసులు లోకేశ్ పై మరో క్రిమినల్ కేసు నమోదు చేసారు. చిత్తూరు నర్సింగరాయపేట పీఎస్ లో కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్లు 188, 341, 290 రెడ్ విత్ 34 కింద కేసు నమోదు చేశారు. అనుమతి లేకుండా సమావేశాన్ని నిర్వహించారని, పాదయాత్రకు ఇచ్చిన అనుమతులను ఉల్లంఘించారని కేసు నమోదు చేశారు. లోకేశ్, ఇతర నేతలపై పోలీసు అధికారులే ఫిర్యాదు చేయడం గమనార్హం. పాదయాత్ర ప్రారంభమైన తర్వాత చిత్తూరు జిల్లాలో నారా లోకేశ్ పై కేసు నమోదు కావడం ఇది ఐదోసారి. లోకేశ్ తో పాటు పులివర్తి నాని, అమరనాథ రెడ్డి, దొరబాబు, చంద్రదండు ప్రకాశ్ లపై కేసులు నమోదు చేశారు.

## అనాధ దళిత యువతిపై లైంగిక దాడి

**శ్రీకాకుళం**

తల్లిదండ్రులను కోల్పోయి ఒంటరిగా నివసిస్తున్న దళిత యువతిపై గ్రామవాలంటీరు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాధితురాలు గర్భం దాల్చిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో జరిగింది. మందస పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రెంటికోటకు చెందిన దళిత యువతి (27) తల్లిదండ్రులు కొన్ని నెలల క్రితం మరణించారు. నాటినుంచి ఆమె మందస మండలంలో యాచిస్తూ జీవనం సాగిస్తోంది. రాత్రిపూట స్థానిక ఎంపీడీఓ కార్యాలయ వరండాలో నిద్రిస్తోంది. దాదాపు నెల క్రితం అదే మండలంలోని జిల్లుండకు చెందిన గ్రామ వాలంటీరు కుణితి బాలకృష్ణ ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలు గర్భం దాల్చడంతో మంగళవారం మందస పోలీసులకు ఫిర్యాదుచేసింది. యువతి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదుచేశామని, గురువారం నిందితుడిని అరెస్టు చేసామని ఎస్సై రవికుమార్ చెప్పారు.

## వ్యక్తి అనుమానాస్పద హత్య

**శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాలి మండలం లఖం దిడ్డి పంచాయితీ మూల పేట గ్రామానికి చెందిన 45 ఏళ్ల మట్ట గవరయ్య బుధవారం రాత్రి అనుమానాస్పదంగా హత్యకు గురయ్యాడు. కోటబొమ్మాలి కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న ఆయన బంజీరు పేట లకం ధిడ్డి మార్గమధ్యలో గురయ్యా హత్యకు గురయ్యాడు. అతని మెడపై తీవ్రమైన కత్తి ఘాట్లు ఉన్నట్లు పోలీసులు గమనించారు. మృతునికి భార్య శ్రీదేవి ఇద్దరు పిల్లలు ఉన్నారు, సంఘటన స్థలానికి చేరుకున్న టెక్కలి సిఐ సూర్య చంద్ర మౌళి పోలీస్ బృందం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

# జేఈఈ తొలివిడతలో ఎస్సీ గురుకుల విద్యార్థుల ప్రతిభ

**అమరావతి :**

జేఈఈ తొలివిడత పరీక్షల్లో ఎస్సీ గురుకులాలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అద్భుతమైన ఫలితాలను సాధించారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించారు. ఈ పరీక్షలు రాసిన 189 మంది విద్యార్థుల్లో 151 మంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడంతో పాటుగా 93 మంది విద్యార్థులు ప్రస్తుతం సాధించిన ఫలితాలతోనే ఎన్ఐటీలలో సీట్లు పొందే అవకాశాన్ని దక్కించుకున్నారని వివరించారు.

ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని చిన్నటేకూరు (కర్నూలు జిల్లా), అడవి తక్కెళ్లపాడు (గుంటూరు జిల్లా), ఈడ్పుగల్లు (కృష్ణా జిల్లా)లలో జేఈఈ, నీట్ శిక్షణా కేంద్రాలు ఉండగా ఈ కేంద్రాల నుంచి ఈసారి మొత్తం 189 మంది విద్యార్థులు జేఈఈ పరీక్షలు రాసారని నాగార్జున గురువారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యార్థులలో 151 మంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హతను సాధించారని చెప్పారు. జేఈఈ తొలి విడత పరీక్షల్లో అరేక మంది ఎస్సీ విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో 99.05 పర్సంటైల్ వరకూ మార్కులను సాధించారని చెప్పారు. అన్ని సబ్జెక్టుల్లోనూ ఓవరాల్ గా చిన్నటేకూరు శిక్షణా కేంద్రానికి చెందిన వరదా పవన్ కుమార్ 96.61, మల్లెపోగు అవన్ కుమార్ 95.49, రవణ కిరణ్ కుమార్ 95.39 పర్సంటైల్ ను సాధించగా, ఈడ్పుగల్లుకు చెందిన జి.మనోజ్ఞ 95.60, అడవి తక్కెళ్లపాడుకు చెందిన అజయ్ భార్గవ్ 93.63 పర్సంటైల్స్ సాధించి ఎస్సీ గురుకులాల్లో టాపర్స్ గా నిలిచారని వివరించారు. ఎన్ఐటీ లలో సీట్లు సాధించడానికి అంచనా వేస్తున్న కటాఫ్ మార్కుల ప్రకారంగా తమ గురుకులాల నుంచి జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించిన 151 మంది విద్యార్థులలో 93 మంది ప్రస్తుతం సాధించిన మార్కులతోనే సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. అయితే అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించిన విద్యార్థులలో కొందరు కొన్ని సబ్జెక్టుల్లోనే అత్యధిక మార్కులు సాధించగలాగారని, మరి కొన్ని సబ్జెక్టుల్లో వివిధ కారణాలతో మార్కులు తగ్గాయని కూడా తాము గుర్తించినట్లు నాగార్జున వెల్లడించారు. ఈ విద్యార్థులు అందరూ రాసే జేఈఈ మలి విడత పరీక్షల్లో వారి లోపాలు సరిదిద్దుకొనేలా శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ విద్యార్థులందరూ ఎస్సీ రిజర్వేషన్ విభాగం నుంచి కాకుండా తమ ప్రతిభతో జనరల్ కేటగిరీలోనే సీట్లు పొందే అవసరమైన శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. గతంలో తమ విద్యార్థులు జేఈఈ సరీక్షల్లో సాధించిన ఫలితాల కంటే ఈసారి ఫలితాలు మరింత మెరుగ్గా వచ్చాయని అభిప్రాయపడ్డారు. జేఈఈ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, ఉత్తమ ఫలితాలను రాబట్టిన గురుకుల అధికారులు, అధ్యాపకులను ఈ సందర్భంగా మంత్రి నాగార్జున అభినందించారు.

# తెలంగాణలోమొదలైన కరెంట్ కష్టాలు

**హైదరాబాద్ :**



తెలంగాణలో కరెంట్ కోతలు విపరీతమయ్యాయి. విద్యుత్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో.. తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్య పరిస్కరించాలని ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని రైతులు ప్రతిరోజూ ధర్నా చేస్తున్నారు. ఓ వైపు అధినేత కేసీఆర్ తెలంగాణలో అమలవుతున్న 24 గంటల విద్యుత్ ను దేశ వ్యాప్తంగా చేస్తామని హామీలు ఇస్తున్నారు. కానీ తెలంగాణలో మాత్రం కనీసం 6 గంటలు కూడా ప్రసారం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలను కొందరు రైతులు నిలదీస్తున్నారు. విద్యుత్ సరఫరాపై ఫోన్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలు ఇది వచ్చే ఎన్నికలకు ఎఫెక్ట్ పడుతుందా? అని చర్చించుకుంటున్నారు. తెలంగాణలో మొన్నటి వరకు విద్యుత్ సమస్య లేదు. 24 గంటలు సాఫీగానే సాగింది. కానీ సరిగ్గా ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్దీ అంతరాయం ఏర్పడడం ఎమ్మెల్యేలకు తలనొప్పిగా మారింది. అసలై బీఆర్ఎస్ ఇచ్చిన కొన్ని హామీలు నెరవేరలేదని కొందరు ఆయా నియోజకవర్గాల్లో మంత్రులను సైతం నిలదీస్తున్నారు. కొందరిని తరిమికొడుతున్నారు కూడా. ఇలాంటి తరుణంలో ఇప్పుడు కరెంట్ కోతలు ఉండడంతో రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. మరి కొద్ది నెలల్లోనే ఎన్నికలు ఉండడంతో ఎమ్మెల్యేలు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుక విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ సమయంలో రైతులు కరెంట్ కోతలపై నిలదీస్తున్నారు. ఇక నియోజకవర్గాల్లోకి రాని వారికి ఫోన్లు చేసి కరెంట్ సమస్యపై అడుగుతున్నారు. గ్రామాల్లో నిత్యం కరెంట్ కోతలు ఉంటున్నాయని సమయ పాల లేకుండా కరెంట్ ను కట్ చేస్తున్నారని అంటున్నారు. ఈ విషయంలో హామీ ఇచ్చేంత వరకు పట్టుబడుతున్నారు. ఇదిలా ఉండగా ఫిబ్రవరిలోనే కరెంట్ కోతలు ఇలా ఉంటే వచ్చే మే వరకు పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో విద్యుత్ ఉత్పత్తికి వినియోగానికి భారీ తేడా ఉంది. దీంతో కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కరెంట్ కొనుగోలు చేయాలంటే ముందుగా డబ్బులు చెల్లించాలి. కానీ డిస్కంలు ఆర్థిక సమస్యతో కొట్టుమిట్టాడుతున్న నేపథ్యంలో సాధ్యం కావడం లేదు. మరోవైపు ఏసీడీ చార్జీల పేరుతో వినియోగదారులపై భారం మోపుతోంది. అయితే ఈ సమస్య నుంచి గట్టెక్కడానికి ప్రభుత్వం ఎటువంటి హామీ ఇస్తుందో చూడాలి.

# ఇసుక రీచ్ వివాదం జేసీ అరెస్టు

**అనంతపురం :**

వైసీపీ ప్రభుత్వంపై తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మరోసారి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు మండలం పరిధిలోని పెన్నా నదిలో ఇసుక రీచ్కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారు. ఇసుక రీచ్ నుంచి బయటికి వస్తున్న లారీలు, టిప్పర్లను జేసీ అడ్డుకున్నారు. పెద్దపప్పూరులో ఇసుకరీచ్ను బంద్ చేసే వరకు వదిలే ప్రసక్తి లేదని జేసీ ప్రభాకర్ భీష్మించుకు కూర్చున్నారు. అధికారులు నిబంధనలు పాటించకుండా అధికార పార్టీ నేతలకు కాసులు వర్షం కురిపించేలాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇసుక తరలింపుకు సంబంధించిన అనుమతులు చూపే వరకు ఇక్కడ నుంచి కదిలేది లేదంటూ రోడ్డుపై కూర్చున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని జేసీ ప్రభాకర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. మైనింగ్ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుక తరలిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక యథేచ్చగా తరలిస్తున్నా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు పట్టించుకోవట్లేదని మండిపడ్డారు. ఇంత మొత్తంలో తవ్వకాలకు అనుమతులు ఉంటే చూపాలని, లేదంటే బాధ్యులపై కేసు పెట్టాలని ప్లకార్డులు ప్రదర్శించారు. పోలీసులు ఇసుక రీచ్ వద్దకు చేరుకుని నిరసన విరమించుకోవాలని సూచించినా పట్టించుకోలేదు. మైనింగ్ అధికారులు వచ్చి సమాధానం చెప్పాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. జేసీ ప్రభాకర్ను అక్కడి నుంచి తరలించేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది.

# తెలంగాణ శాసనసభ నుంచి కాంగ్రెస్ వాకౌట్

**హైదరాబాద్ :**

తెలంగాణ శాసనసభ నుంచి కాంగ్రెస్ సభ్యులు వాకౌట్ చేశారు. విద్యుత్ సమస్యపై కాంగ్రెస్ పార్టీ ఈరోజు శాసనసభలో వాయిదా తీర్మానాన్ని ఆమోదించింది. అయితే కాంగ్రెస్ ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తిరస్కరించారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. శాసనసభలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు, జగ్గారెడ్డి, సీతక్కలు అసెంబ్లీ పరిసరాల్లో ప్లకార్డులతో నిరసన తెలిపారు. కరెంట్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతులకు 24 గంటల త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎల్పీ మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించారు. అందుకే నిరసనకు దిగారు. రాష్ట్రంలో కరెంటు కోతలు పెరిగిపోయాయని అన్నారు. రైతులకు 4 గంటలు కూడా కరెంటు ఇవ్వడం లేదన్నారు. కరెంటు ఏ సమయంలో ఇస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రైతుల సమస్యలపై వాయిదా తీర్మానం ఇచ్చామని, అయితే స్పీకర్ చర్చకు అనుమతించలేదన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీధర్ బాబు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.

## ఇది ఎన్నికల బడ్జెట్-ఎంపి కోమటిరెడ్డి

**ఇబ్రహింపట్నం**

రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా అంకెల గారడి మాత్రమేనని ఎంపి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపించారు. బడ్జెట్ పై అయన గురువారం స్పందించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లో ఒక ప్రైవేటు హోటల్ ఓపెనింగ్ అయన వచ్చారు. కోమటిరెడ్డి మాట్లాడుతూ రెండు లక్షల 90 కోట్లు గతంలో రాష్ట్ర బడ్జెట్ పెట్టి రెండు లక్షల కూడా ఖర్చు పెట్టలేదని విమర్శించారు. హరీష్ రావు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల బడ్జెట్ అని విమర్శించారు. పేదోడికి ఎన్ని ఇళ్లలు కట్టిస్తామో అని బడ్జెట్లో చెప్పలేదు. గతంలో ఐదు లక్షలు అన్నారు మూడు లక్షల అంటున్నారు ఇవి కూడా ఇస్తారో ఇవ్వరో కూడా తెలవని పరిస్థితిని ఏర్పడిందని అన్నారు. మిషన్ భగీరథ విషయంలో ప్రభుత్వం పూర్తిగా ఫెయిల్ అయింది. కావాలంటే మంత్రి జగదీశ్వర్ రెడ్డి సొంత ఊరు నాగారంలో గ్రామస్థులు తాగడానికి నీళ్ల లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నా సొంతంగా ప్లాంట్ చేయబోతే ఆపారని అన్నారు. హత్ సే హత్ జోడయాత్ర

ఈనెల 13న పార్లమెంట్ సమావేశాలు అయిపోయిన తర్వాత నల్లగొండ, మహబూబ్నగర్, ఖమ్మం ,రంగారెడ్డి నాలుగు జిల్లాలను కలుపుకొని బస్సు యాత్ర లేదా బైక్ యాత్ర ఏదో ఒకటి చేపడతానని అయన పేర్కొన్నారు

ఎన్నికలకు సమయం తక్కువగా ఉంది. 12 నియోజకవర్గాలను లో పూర్తిగా బైక్ యాత్ర త్వరలో చేస్తానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు

## నూతన భవన నిర్మాణానికి భూమి పూజ

**నంద్యాల**

బొమ్మలసత్రం వద్దగల జిల్లా పోలీస్ కార్యాలయం నందు నూతన భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామాన్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి,,జాయింట్ కలెక్టర్ టి నిశాంతి ఆధ్వర్యంలో పోలీస్ కార్యాలయం నందు 65 లక్షల వ్యయంతో ఏ ఆర్ భవన నిర్మాణ సముదాయము మరియు పోలీస్ శాఖలోని వివిధ విభాగాలకు సంబంధించి భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేయడానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. వీలైనంత తొందరగా భవన నిర్మాణం పనులు చేపట్టి పూర్తి చేయాలని సంబంధిత భవన నిర్మాణ అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఆర్ రమణ, ,నంద్యాల టౌన్ డిఎస్పి సి. మహేశ్వర్ రెడ్డి, నంద్యాల ఏ ఆర్ డి.ఎస్.పి సంకురయ్య, నంద్యాల సబ్ డివిజన్ సిఐలు ఆర్ ఐ లు ఎస్సై లు పాల్గొన్నారు.

## తిరుమలకు ఆధ్యాత్మిక పాదయాత్ర

**ప్రొద్దుటూరు,**

సర్వ మానవాళి ప్రజలంతా సుభిక్షంగా సంతోషంగా ఉండాలని అందరికీ ఆకలియు గదైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య ఆశీస్సులు అంది అందరూ బాగుండాలనే సంకల్పంతో మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాల రెడ్డి ఆధ్వర్యంలో వంగల నారాయణరెడ్డి సహాయ సహకారాలు అధ్యక్షతన, ప్రొద్దుటూరు నుంచి తిరుమలకు దాదాపుగా 450 మంది ఆధ్యాత్మిక పాద యాత్ర చేపట్టనున్నారు. టీటీడీ కల్యాణ మండపం నుండి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ శోభా పాదయాత్రను మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారు. ఈ పాదయాత్ర 9వ తేదీ నుండి 15 వరకు సాగును ఈ పాదయాత్ర మైదుకూరు,కాజీపేట,కడప, రాజంపేట మీదుగా రైల్వే కోడూరు చేరుకొని కుక్కల దొడ్డి నుండి అన్నమయ్య కాలిబాట ద్వారా ఈ మహా బాలాజీ పాదయాత్ర తిరుమల చేరుకొనునని. శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శన టికెట్లు కూడా తానే కల్పిస్తూ అందరికీ దర్శనభాగ్యం కల్పించి తిరిగి ప్రొద్దుటూరుకు చేరనున్నట్లు నిర్వాహకులు వంగల నారాయణరెడ్డి తెలిపారు. ఈ పాదయాత్రలో పాల్గొనే భక్తులకు భోజన సదుపాయాలను తానే స్వయంగా తన పర్యవేక్షణలోనే చూస్తున్నట్లు తెలిపారు. ఎక్కడ ఏవ్వరికి ఏటువంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలను పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను విస్మరించేవారు శిక్షార్హులే

**కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా**

**జగిత్యాల**

:వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. గురువారం కలెక్టర్ చాంబర్ లో తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో నూతనంగా పడవీభాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషాను ను జిల్లా సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు కలిసి స్వాగతిస్తు పుష్పగుచ్చాలు అందించి పట్టు శాలువాలతో సన్మానించారు. అనంతరం అసోసియేషన్ డైరీ2023,క్యాలండర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. తమ అసోసియేషన్ ముద్రించిన సిటిజన్స్ చట్టం అవగాహన పిలుపు పుస్తకాన్ని హరి ఆశోక్ కుమార్ అందజేశారు. కలెక్టర్ కార్యాలయంలోని ఇతర అధికారులకూ డైరీలు,పిలుపు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ డైరీ, క్యాలెండర్ ,పిలుపు ప్రత్యేక ద్వీమాస పత్రికలు వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహనకు దర్శిణులుగా ఉన్నాయన్నారు.,అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు సీనియర్ సిటిజన్స్ కు చేస్తున్న సేవలను అభినందించాం

# పేద విద్యార్థుల చదువు కోసం మాష్టారు పోరాటం.. ఆకట్టుకుంటున్న 'సార్' ట్రైలర్




ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ తో కలిసి తెలుగు, తమిళ భాషల్లో నిర్మించిన ద్విభాషా చిత్రం 'సార్'(తెలుగు)/ 'వాతి'(తమిళం). శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. స్టార్ యాక్టర్ ధనుష్, సంయుక్త మీనన్ జంటగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఫిబ్రవరి 17న ప్రపంచ వ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ధనుష్ నటించిన తొలి తెలుగు సినిమా కావడంతో 'సార్'(వాతి)పై తమిళ్ తో పాటు తెలుగులోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. బుధవారం సాయంత్రం హైదరాబాద్ లోని ఏఎంబీ సినిమాస్ లో ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. కథానాయకుడు ధనుష్, కథానాయిక సంయుక్త మీనన్, దర్శకుడు వెంకీ అట్లూరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తాజాగా విడుదలైన 'సార్' మూవీ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. చదువుని వ్యాపారంగా చేసుకొని పేద విద్యార్థులకు చదువు అందకుండా చేస్తూ పెద్ద మనుషులుగా చలామణీ అవుతున్న వ్యక్తులపై కథానాయకుడు సాగించే పోరాటమే 'సార్'. త్రిపాఠి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ తరపున కొన్ని ప్రభుత్వ కళాశాలను దత్తతు తీసుకుంటారు. అక్కడికి ఫ్యాకల్టీగా కథానాయుడు వెళ్తాడు. హాస్యం, ప్రేమ సన్నివేశాలతో సరదాగా సాగిపోతున్న కథలో.. కొందరి స్వార్థం కారణంగా పేద విద్యార్థులకు చదువు దూరమయ్యేలా కొన్ని అనూహ్య సంఘటనలు చోటు చేసుకుంటాయి. ఆ విద్యార్థుల తరపున సార్ ఎలా పోరాటం సాగించాడో అనే ఆసక్తిని రేకెత్తిస్తూ రూపొందిన ట్రైలర్ మెప్పిస్తోంది. "చదువుకోవాలన్న ఆశ ఉన్నప్పుడు వాళ్ళకి చదువు దొరకలేదు.. ఇప్పుడు మీరు వచ్చినా వాళ్ళ కోసం మీరు ఉంటారన్న నమ్మకం వాళ్ళకి కుదరడం లేదు", "ఎడ్యుకేషన్ లో వచ్చినంత డబ్బు పాలిటిక్స్ లో రాదు", "డబ్బు ఎలాగైనా సంపాదించుకోవచ్చు..కానీ మర్యాదని చదువు మాత్రమే సంపాదించి పెడుతుంది" వంటి సంభాషణలు కథానుసారం బలంగా, ఆకట్టుకునేలా ఉన్నాయి. దర్శకుడి అద్భుతమైన సృష్టికి జె. యువరాజ్ కెమెరా పనితనం, జి.వి. ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం తోడై ట్రైలర్ ను మరోస్థాయికి తీసుకెళ్లాయి.

ట్రైలర్ విడుదల సందర్భంగా కథానాయకుడు ధనుష్ మాట్లాడుతూ.. "ఇది నాకు చాలా ప్రత్యేకమైన రోజు. ఇది నా మొదటి తెలుగు సినిమా. చాలా సంతోషంగా ఉంది. ఒకప్పుడు తెలుగు సినిమా, తమిళ సినిమా, కన్నడ సినిమా, హిందీ సినిమా అనేవాళ్ళు. కానీ ఇప్పుడు ఇండియన్ సినిమా అనడం సంతోషించదగ్గ విషయం. ఈ కథ చాలా బాగుంటుంది. నాకు ఇంతమంచి సినిమా ఇచ్చినందుకు వెంకీ అట్లూరి గారికి ధన్యవాదాలు. అలాగే చినబాబు గారికి, నాగవంశీ గారికి, త్రివిక్రమ్ గారికి, సంయుక్త మీనన్, హైపర్ ఆది మరియు మా టీమ్ అందరికీ ధన్యవాదాలు." అన్నారు.

దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "లాక్ డౌన్ సమయంలో ఈ కథ రాసుకొని వంశీ గారికి వినిపించగా ఆయనకు నచ్చింది. లాక్ డౌన్ కావడంతో అప్పుడు హీరోలు పెద్దగా కథలు వినే ధైర్యం చేయలేదు. కానీ ధనుష్ గారు మాత్రం కథ చెప్పడానికి రమ్మన్నారు. ఈ సినిమా ఆయన చేసిన చేయకపోయినా ఆయనకు కథ చెప్పానన్న సంతృప్తి నాకు చాలు అనుకున్నాను. కానీ ఆయన కథ వినగానే ఈ సినిమా చేస్తున్నాను అనడంతో నాకు ఆ ఆనందంలో మాటలు రాలేదు. నాకు ఈ అవకాశమిచ్చిన వంశీ గారికి, ధనుష్ గారికి జీవితాంతం రుణపడి ఉంటాను" అన్నారు.

నాయిక సంయుక్త మాట్లాడుతూ సర్ సినిమా అందరినీ అలరిస్తుందని తెలిపారు.

హైపర్ ఆది మాట్లాడుతూ.. " ధనుష్ గారి సినిమాల్లో రఘువరన్ బి.టెక్ తర్వాత తెలుగు ప్రేక్షకులు కనెక్ట్ అయ్యే సినిమా సార్. అద్భుతంగా ఉంటుంది ఈ సినిమా. ఒక తెలుగు యువ దర్శకుడు తమిళ స్టార్ కి కథ చెప్పి ఒప్పించాడంటే తెలుగు ప్రేక్షకులు గర్వంగా ఈ సినిమా చూడాలి. అలాగే పాపులర్ స్టార్ అయ్యుండి కథ నచ్చి మూడు సినిమాల అనుభవమున్న దర్శకుడికి అవకాశమిచ్చాడంటే తమిళ ప్రేక్షకులు గర్వంగా ఈ సినిమా చూడాలి. తెలుగు, తమిళ ప్రేక్షకులందరూ మెచ్చేలా ఉంటుంది ఈ సినిమా. తప్పకుండా ఫిబ్రవరి 17న థియేటర్లకి వెళ్లి చూడండి" అన్నారు.

చివరిగా కదహానాయకుడు ధనుష్ చిత్రం లో నటించిన స్టూడెంట్స్, టీమ్ తో కలసి చిత్రంలోని ' మాస్టారు.... మాస్టారు' గీతం ఆలపించి అభిమానుల సంతోషాన్ని అంబరాన్ని తాకేలాచేశారు.









Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950